


ప్రాజెక్టుల్లో మునిగిపోతున్న

నిర్వాసిత జీవితాలు

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 261 శనివారం 10 జనవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -7 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# జల వివాదాలను మనమే పరిష్కరించుకుందాం

## చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నా : వివాదాలపై రేవంత్ రెడ్డి కీలక సూచన

**రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించుకుందామని వ్యాఖ్య**

**కోర్టుల్లో కాకుండా మన సమస్యలు మనమే పరిష్కరించుకుందామని స్పష్టీకరణ**

**ఏపీ ఒక అడుగు వేస్తే, తెలంగాణ పది అడుగులు వేస్తుందన్న రేవంత్ రెడ్డి**

**రంగారెడ్డి జనవరి 9 (జర్నలిస్ట్ వార్త):**
నదీజలాల విషయంలో పక్క రాష్ట్రాలతో వివాదాలు కోరుకోవడం లేదని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నదీ జలాలకు సంబంధించి పంచాయతీ కావాలా..! నీళ్లు కావాలా..! అని అడిగితే తెలంగాణ రాష్ట్రానికి నీళ్లు కావాలని కోరుకుంటామని చెప్పారు. కృష్ణా జలాల విషయంపై కూర్చొని మాట్లాడుకుందామని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు అడ్డంకులు సృష్టించొద్దని కోరారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంమిగతా 2లో...




# ఉర్దూ వర్సిటీ భూముల జోలికి రావద్దు

## కాంగ్రెస్ ప్రభుత్వానికి కెటిఆర్ హెచ్చరిక



**హైదరాబాద్,జనవరి 9 (జర్నలిస్ట్ వార్త):** మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ భూములపై రేవంత్ సర్కార్ కుట్రల నేపథ్యంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. దేశంలో మైనార్టీల సంరక్షకుడినని చెప్పుకునే రాహుల్ గాంధీ.. ఉర్దూ యూనివర్సిటీ భూములను అన్యాక్రాంతం చేయడమే కాపాడటమా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో కేటీఆర్‌తో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులు సమావేశమయ్యారు. యూనివర్సిటీకి చెందిన 50 ఎకరాల భూమిపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై చర్చించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చి చదువుకుంటున్న మైనార్టీ విద్యార్థుల యూనివర్సిటీని నిర్వీర్యం చేయడమే మీ సంరక్షణనా అని ప్రశ్నించారు. దీనిపై సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. మీరు చెబుతున్న మొహబ్బత్ కి దుకాణం ఇదేనా అని ప్రశ్నించారు. విద్యార్థులను వారి భూములనుమిగతా 2లో...

# ఈ నెల 28 నుంచి కేంద్ర బడ్జెట్ సమావేశాలు

**రెండు విడతలుగా ఏప్రిల్ 2 వరకు పార్లమెంటు సమావేశాలు కొనసాగింపు**

**అరుదుగా ఆదివారం రోజున ఫిబ్రవరి 1న బడ్జెట్ సమర్పణ**

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో సభ ప్రారంభం**

**షెడ్యూల్ వెల్లడించిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు**

**ఢిల్లీ జనవరి 09:**
2026 సంవత్సరానికి సంబంధించిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల షెడ్యూల్ ఖరారైంది. జనవరి 28 నుంచి ఈ సమావేశాలు జరగనున్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈసారి కేంద్ర బడ్జెట్‌ను ఆదివారం రోజున ప్రవేశపెట్టే అవకాశం ఉండటం ఈ సమావేశాల ప్రత్యేకతగా నిలవనుంది. రెండు విడతలుగా సాగే ఈ సమావేశాలు ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి.మిగతా 2లో...



# జల జగడాలు వద్దు

**తెలుగుజాతి ప్రయోజనాలే ముఖ్యం**

**2027 మార్చిలోగా 'పోలవరం' పూర్తి**

**రాయవరం సభలో ఏపీ సీఎం చంద్రబాబు**




రాజమహేంద్రవరం : 'సముద్రంలో కలిసే నీళ్ల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య గొడవలు ఎందుకు? నీళ్లు వద్దూ గొడవలే కావాలని కొందరు బయల్దేరారు. కొందరు రాయలసీమ ఎత్తిపోతల అంటూ వివాదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. నాకు గొడవలు కాదూ తెలుగు జాతి ప్రయోజనాలు కావాలి. పోలవరం పూర్తయితే ఆ నీళ్లు తెలంగాణ కూడా వాడుకునే అవకాశం ఉంటుంది. వివాదాల వల్ల ఎలాంటి ఉపయోగమూ లేదు' అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలంలో ఆయన శుక్రవారం పర్యటించారు. తొలుత రాయవరం గ్రామంలో సర్వే చేసిన పంట భూములను పరిశీలించారుమిగతా 2లో...

# రచ్చకెక్కిన బెంగాల్ రాజకీయం

**ఇడి చర్యలపై మమతా నిరసన ప్రదర్శన**

**మమతా బెనర్జీ తీరుపై మండిపడ్డ బిజెపి**

**విచారణకు అడ్డుపడడంపై సుప్రీంలో ఇడి పిటిషన్**

కోల్‌కతా**జనవరి 9 (జర్నలిస్ట్ వార్త):**ండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ , దాని సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్‌పై ఈడీ దాడుల వ్యవహారం రచ్చకెక్కింది. దీనిపై శుక్రవారం నాడు కేంద్రం, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం మధ్య ఘర్షణ మరింత తీవ్రమైంది. 2లో...



# సైబర్ నేరగాళ్ల బాధితులకు అండ

**సైబర్ మిత్ర పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటు**

**బాధితులు 1930కు ఫోన్ చేయాలన్న కమిషనర్ సజ్జన్నార్**

హైదరాబాద్,**జనవరి 9 (జర్నలిస్ట్ వార్త):**
సైబర్ నేరాల బాధితులకు హైదరాబాద్ పోలీసులు ఎల్లప్పుడు అండగా ఉంటారని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. శుక్రవారం నాడు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ సీసీఎస్ కార్యాలయంలో సైబర్ మిత్ర పేరుతో రూపొందించిన ప్రత్యేక విభాగాన్ని సజ్జనార్ ప్రారంభించారు. అనంతరం సీపీ సజ్జనార్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లకు చిక్కిన బాధితులకు ఈ సెల్ ఎంతో సహాయంగా ఉంటుందన్నారు.మిగతా 2లో...






# 'పున మార్గం' ఎఫెక్ట్...

**భద్రతా బలగాల ముందు లొంగిపోయిన 63 మంది మావోయిస్టులు**

**వీరిలో రూ.1.19 కోట్ల రివార్డులు ఉన్న 36 మంది**

**లొంగిపోయిన వారిలో కీలక డివిజనల్ కమిటీ సభ్యులు**

బస్తర్ **జనవరి 9 (జర్నలిస్ట్ వార్త):**
ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. శుక్రవారం దంతెవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో 18 మంది మహిళలు సహా మొత్తం 63 మంది మావోయిస్టులు భద్రతా బలగాల ముందు లొంగిపోయారు. వీరిలో 36 మందిపై మొత్తం రూ. 1.19 కోట్ల రివార్డు ఉండటం గమనార్హం.మిగతా 2లో...

# విద్వేషాలు రేపితే ఎరిపారేస్తా

**అవాస్తవాలు వైరల్ చేస్తూ చూస్తూ ఊరుకోను**

**శాంతిభద్రతల విషయంలో పోలీసులు కఠినంగా ఉండాలి**

**పట్టణ పారిశుద్ధ్యంపై మున్సిపల్ సిబ్బంది శ్రద్ధ పెట్టాలి**

**పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు ప్రారంభించిన పవన్ కళ్యాణ్**

**సంక్రాంతి అందరి పండగగా జరుపుకోవాలని పిలుపు**



కాకినాడ,**జనవరి 9 (జర్నలిస్ట్ వార్త):**
పపిఠాపురంలో ఏ చిన్న సంఘటన జరిగినా వైరల్ చేస్తున్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. పిఠాపురంలో కొబ్బరాకు, తాటాకు పడినా ఏదో జరిగిందని ప్రచారం చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. అవాస్తవాలను వైరల్ చేయడం మానుకోవాలని హితవు పలికారు. పిఠాపురంలో నిర్వహించిన 'పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.మిగతా 2లో...

# టెట్ ఫలితాలు వచ్చేశాయ్!

**ఏపీ టెట్ 2025 ఫలితాలు అధికారికంగా విడుదల**

**మొత్తం 39.27 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణులు**

**పరీక్షకు హాజరైన వారిలో 97,560 మంది అర్హత**




విజయవాడ,**జనవరి 9 (జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్-2025) ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ పరీక్షలో మొత్తం 39.27 శాతం మంది అభ్యర్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది డిసెంబర్ 10 నుంచి 21 వరకు ఈ పరీక్షలను నిర్వహించిన సంగతి తెలిసిందే.మిగతా 2లో...

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# జల జగడాలు వద్దు

(మొదటి పేజి తరువాయి)

. అనంతరం రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. ఎటువంటి అవినీతి అక్రమాలకూ తావులేకుండా రైతులకు రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాలను అందిస్తున్నామన్నారు.

రీసర్వే పూర్తి అయిన 6,688 గ్రామాల్లోని భూములకు సంబంధించి 22.33 లక్షల పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గోదావరి పుష్కరాలను వరుసగా మూడోమారు ముఖ్యమంత్రిగా నిర్వహించే అదృష్టం తనకు దక్కిందన్నారు. 2027 మార్చిలోగా పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. ఏటా మూడు వేల టిఎంసిల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయని, ఇందులో 300 టీఎంసీలు వాడుకుంటే వచ్చే నష్టం ఏమీ లేదని పేర్కొన్నారు. పోలవరాన్ని ఒక యజ్ఞంగా భావించి పూర్తి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ వైఫల్యం వల్లే ఈ ప్రాజెక్టు పూర్తి కావడంలో జాప్యం జరిగిందన్నారు. గత పాలకుల తప్పిదాల వల్ల రూ.వెయ్యి కోట్లతో డయాఫ్రం వాల్ మళ్లీ కట్టాల్సి వస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టుతో నీటి ఎద్దడి లేకుండా చేయడమే లక్ష్యమని తెలిపారు. పట్టిసీమ కట్టి కృష్ణా డెల్టాలో వినియోగించుకుందామంటే వ్యతిరేకించారని విమర్శించారు.కృష్ణా డెల్టాలో నీళ్లను పొదుపు చేసి శ్రీశైలం నుంచి రాయలసీమ ప్రాంతానికి తరలిస్తామన్నారు. కొందరు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రెవెన్యూ వివాదాలను పరిష్కరించడానికే రెండేళ్లు పట్టిందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టును పిపిపిలో కడుతుంటే ముద్దు కానీ, పిపిపి కింద మెడికల్ కాలేజీలు కడితే వద్దంటున్నారని విమర్శించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామన్నారు. దేశంలోకొచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం మన రాష్ట్రానికే వచ్చాయని పేర్కొన్నారు. ట్రిబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ తరహాలో ప్రధాని మోడీ, పవన్ కల్యాణ్‌తో కలిసి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గుంతలు లేని రహదారులను తయారు చేస్తున్నామని, రెండు రోజుల్లోనే 40 కిలోమీటర్ల రోడ్డు వేసి రికార్డు సృష్టించామని తెలిపారు.ట్రూ డౌన్ పేరుతో విద్యుత్తు బిల్లుల భారం తగ్గించామన్నారు. రూ.4,500 కోట్లు పెంచుకోమని ఇఆర్‌సి అనుమతి ఇస్తే, ప్రజాప్రయోజనాల దృష్ట్యా వద్దని చెప్పామని తెలిపారు. భవిష్యత్తులోనూ కరెంటు ఛార్జీలు పెంచబోమని మరోమారు స్పష్టం చేస్తున్నామన్నారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు పేరిట సుపరిపాలన అందించేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. జగ్గన్నపేట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండగగా ప్రకటించామన్నారు. సంక్రాంతికి కోడి పందేలు సంప్రదాయమే కానీ, జూదాల జోలికి వెళ్లొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎంపీ జి.హరీష్‌మాథూర్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జల వివాదాలను మనమే పరిష్కరించుకుందాం

(మొదటి పేజి తరువాయి)

రావిర్యాల్‌లోని ఈ-సిటీలో నెలకొల్పిన సుజెన్ మెడికేర్ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు. రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిందన్నారు. నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ లబ్ది పొందాలన్న ఆలోచన కాంగ్రెస్‌కు లేదన్నారు. రాజకీయాలకతీతంగా పరిష్కారం కోసం అందరూ సహకరించాలని ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేశారు. మన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు ఈ వేదిక ద్వారా విజ్ఞప్తి చేస్తున్నట్టు ప్రకటించారు. "పక్క రాష్ట్రాలతో తెలంగాణ వివాదాలను కోరుకోవడం లేదు. న్యాయస్థానాల ముందుకు లేదా మరెవరి వద్దనో పంచాయితీ పెట్టుకునే కన్నా కూర్చొని చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలి" అని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, డిండి, ఎస్‌ఎల్బీసీ, బీమా, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాల వల్ల పర్యావరణం, సీడబ్ల్యూసీ నుంచి సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన నిధులు, అనుమతులు కూడా రావడం లేదని, తద్వారా రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని చెప్పారు. రాజకీయ ప్రయోజనా లకన్నా ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసం ఆలోచి స్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పోర్టు కనెక్టివిటీ లేని తెలంగాణకు మచిలీపట్నం పోర్టుతో కనెక్టివిటీ కోసం 12 లైన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, రైల్వే కనెక్టివిటీతో సహా అనుమతి అడిగామని, ఆ కనెక్టివిటీని అభివృద్ధి చేయాలంటే పక్క రాష్ట్రం సహకారం అవసరమని చెప్పారు. ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధి చెందాలంటే తెలంగాణ సహకారం అవసరం ఉంటుందని, పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారమవు తాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలతో పరస్పర సహకారాన్ని మాత్రమే కోరుకుంటున్నామని చెప్పారు.

తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ మూడు భాగాలుగా అభివృద్ధి లక్ష్యలను నిర్దేశిస్తూ గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేశామని వివరించారు. ఇందులో భాగంగా సుజెన్ మెడికేర్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ప్రపంచంలో జర్మనీ, జపాన్, సౌత్ కొరియా, న్యూయార్క్‌తో పోటీ పడాలని సంకల్పించామని, అందులో భాగంగానే యువ పారిశ్రామిక వేత్తలు ప్రారంభించే పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఫార్మా రంగంలో తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో నిలుస్తోందని, బల్క్ డ్రగ్స్ ఉత్పత్తి దేశంలో తెలంగాణ నుంచి 40 శాతం ఉందని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. జర్మన్ టెక్నాలజీతో దక్షిణ భారత దేశంలోనే ఐవీ ఫ్లూయిడ్స్ తయారీలో గొప్ప సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రపంచమే మనవైపు చూసేలా ఫార్మా రంగంలో రాణిస్తున్నామన్నారు.

1995 నుంచి 2025 వరకు 30 ఏండ్ల నిరంతర శ్రమ వల్ల హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీ పడుతోందని ముఖ్యమంత్రి చెప్పారు. మన దగ్గర చదువుకుని వెళ్లిన వారు గ్లోబల్ కంపెనీలకు సీఈవోలుగా ఉన్నారన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటే ప్రయివేట్ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ వల్ల ఇక్కడి భూముల ధరలు పెరుగుతాయని, అభివృద్ధికి అందరూ సహకరించాలని, సహకారం ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# విద్వేషాలు రేపితే ఎరిపారేస్తా








(మొదటి పేజి తరువాయి)

పులివెందులలో సొంత బాబాయ్‌ని చంపినా అది వార్త కాదు.. పిఠాపురంలో స్కూల్ పిల్లలు కొట్టుకున్నా అది పెద్ద వార్త అవుతుంది. పిఠాపురం వచ్చి గొడవలు చేద్దామనుకుంటే ఇక్కడ కూర్చొని ఏరివేస్తాను. గత ప్రభుత్వంలో బూతులు తిట్టడం, కేసులు పెట్టడం చేశారు. పిఠాపురంలో మళ్లీ అలాంటివి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. శాంతి భద్రతల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలి. నా మాటలు మెత్తగా.. చేతలు గట్టిగా ఉంటాయి. నన్ను అన్నా.. పార్టీని అన్నా భరిస్తా. ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే వారిని మాత్రం క్షమించనని ఘాటుగా హెచ్చరించారు. అంతకుముందు పలు స్టాళ్లను మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌తో కలిసి ఆయన సందర్శించారు. పిఠాపురం సంక్రాంతి ఉత్సవాలకు చిరునామా కావాలన్నారు ఈ పండుగ అన్ని మతాలు జరుపుకొనే స్థాయికి ఎదగాలి. తెలంగాణకు ఆంధ్రా ప్రాంత ప్రజల ప్రేమను తీసుకెళ్లాలి. అక్కడి సోదరీమణులను సంక్రాంతికి ఆహ్వానించి.. వారికి గోదావరి జిల్లాల ఆతిథ్యాన్ని రుచి చూపాలి. సంక్రాంతి అంటే కోడిపందేలు, జూదాలు మాత్రమే కాదు. ఈ సరదాలను నేను కాదనడం లేదు.. చేసేవాళ్లు చేసుకోండి. కానీ వాటికే పరిమితం కాకూడదన్నారు. పిఠాపురం.. దేశానికి చాలా కీలకమైన శక్తిపీఠం. శ్రీపాద శ్రీవల్లభుడు వెలసిన నేల ఇది. ఇక్కడి నుంచి నేను పోటీ చేయడం భగవంతుడి సంకల్పం. పిఠాపురం అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాం. నన్ను బలోపేతం చేస్తే మరింతగా పనిచేస్తా. అధికారం ఉన్నా లేకపోయినా ఆఖరిశ్వాస వరకు ఇక్కడి ప్రజల కోసం పనిచేస్తాను. సీఎం చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి చాలా అవసరం. కూటమి నేతలు పొత్తులను బలహీనం చేసే ప్రయత్నం చేయొద్దు. ప్రజలను ఎలా కాపాడాలి అనే అంశంపై నాకు, చంద్రబాబుకు పూర్తి అవగాహన ఉందని పవన్ అన్నారు.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. తన సొంత నియోజకవర్గం కాకినాడ జిల్లా పిఠాపురంలో పర్యటిస్తున్నారు.. అయితే, స్థానిక అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు పవన్.. పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌తో పాటు డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం కమిషనర్ వ్యవహారశైలిని ఆయన తప్పుబట్టారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్త, అపరిశుభ్ర పరిస్థితులను చూసి పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలు ఇంత చెత్తగా ఉంటే అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు ఎలా ఉంటాయి? నేను అయితే ఇలాంటి చోట ఒక్క రోజు కూడా ఉండలేను. అసలు నేను చీపురు పట్టి రోడ్లు తుడవాలా? అంటూ అధికారులను నిలదీశారు. ఇక, పిఠాపురంలో పారిశుధ్య నిర్వహణ విఫలమవుతున్న నేపథ్యంలో.. 'గుడ్ మార్నింగ్ పిఠాపురం' కార్యక్రమాన్ని కూడా తానే స్వయంగా నిర్వహించాలా? అని పవన్ తీవ్రంగా ప్రశ్నించారు. ప్రజలకు కనీస సదుపాయాలు అందించడంలో మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. పిఠాపురం అభివృద్ధి కోసం పాడా పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రకటించినా, దాని అమలు విషయంలో వేగం లేకపోతే ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. అవసరమైతే రాజకీయ-పరమైన అడ్మినిస్ట్రేషన్ నిర్ణయాలు తీసుకోలేరా? అభివృద్ధి కోసం ప్రభుత్వం గట్టి అడుగులు వేయొద్దా? అని అధికార పార్టీ నేతలను, యంత్రాంగాన్ని నిలదీశారు.కాలనీల్లో నడుచుకుంటూ సమస్యలు తెలుసుకున్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. కేవలం సమీక్షలకే పరిమితం కాకుండా, పవన్ కల్యాణ్ పిఠాపురం కాలనీల్లో నడుచుకుంటూ వెళ్లి స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, చెత్త నిర్వహణ, మౌలిక వసతుల కొరతపై ప్రజలు చెప్పిన అంశాలను ఆయన నోట్ చేసుకున్నారు. అయితే, పిఠాపురం పారిశుధ్య వ్యవస్థను వెంటనే మెరుగుపర్చాలని, అధికార యంత్రాంగం ప్రజల అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నిర్లక్ష్యం కొనసాగితే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు.

# సైబర్ నేరగాళ్ల బాధితులకు అండ

(మొదటి పేజి తరువాయి)



దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో సైబర్ క్రైమ్‌పై హెల్ప్ డెస్క్ ఏర్పాటైందని వివరించారు. సైబర్ క్రైమ్‌ల్లో బాధితుల సంఖ్య పెరుగుతోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే 1930కి ఫోన్ చేయాలని బాధితులకు సూచించారు. సైబర్ దాడికి గురైతే మ్యూల్ ఖాతాలకు నగదు బదిలీ అయి.. విత్ డ్రా చేస్తారన్నారు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే గో÷-డలెన్ అవర్‌ను వినియోగించుకోవాలంటూ బాధితులకు ఆయన కీలక సూచన చేశారు. నేరం జరిగిన గంట లోపు ఫిర్యాదు చేస్తే నగదు ఫ్రీజ్ అవుతుందన్నారు. సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్ చేసి.. ఫిర్యాదు చేస్తే సరిపోదన్నారు. అనంతరం స్థానిక పోలీసులకు సైతం ఫిర్యాదు చేయాల్సి ఉందని చెప్పారు. కానీ చాలా మందికి ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియడం లేదన్నారు. నూతన విధానం ద్వారా బాధితులు తమ ఫిర్యాదును పోస్ట్ ద్వారా లేదా పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్
ద్వారా పంపవచ్చన్నారు. సైబర్ మిత్ర సెల్‌లోని పోలీసులు.. బాధితులకు ఫోన్ చేసి ఫిర్యాదు ఎలా రాయాలి? ఏయే సెక్షన్లు వర్తిస్తాయనే విషయాలపై అవగాహన కల్పిస్తారు. ఇంటి నుంచే ఎఫ్‌ఐఆర్ పొందే సౌకర్యాన్ని కల్పించడం ద్వారా 100 శాతం కేసుల నమోదును లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ట్రయిల్‌లో భాగంగా 86 మందికి ఫోన్ చేశామని.. వారి నుంచి మంచి స్పందన వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ సైబర్ నేరానికి గురికాకుండా జాగ్రత్తగా ఉండాలంటూ ప్రజలకు స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై తరచూ ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారంటూ హైదరాబాద్ పోలీసులను నగర సీపీ సజ్జనార్ ప్రశంసించారు.

# 'పున మార్గం' ఎఫెక్ట్...

(మొదటి పేజి తరువాయి)

దంతెవాడ జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ) కార్యాలయంలో ఈ లొంగుబాటు కార్యక్రమం జరిగింది. హింసను వీడి జనజీవన స్రవంతిలో కలిసేలా మావోయిస్టులను ప్రోత్సహించేందుకు దంతెవాడ పోలీసులు చేపట్టిన 'పున మర్గం' (పునరావాసం - పునరుజ్జీవనం) ప్రచారమే ఈ భారీ లొంగుబాటుకు కారణమని అధికారులు తెలిపారు. డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్పీఎఫ్ బలగాలు వీరిని లొంగిపోయేలా చేయడంలో కీలక పాత్ర పోషించాయి.లొంగిపోయిన వారిలో దర్భా డివిజన్, దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్, మాడ్ డివిజన్‌లతో పాటు ఒడిశాలో పనిచేసిన వారు కూడా ఉన్నారు. వీరిలో డివిజనల్ కమిటీ సభ్యులు (డీవీసీఎమ్) మోహన్ కడ్తీ, సుమిత్రా కడ్తీ, పీపుల్స్ పార్టీ కమిటీ సభ్యురాలు (పీపీసీఎమ్) హంగీ వంటి కీలక నేతలు ఉన్నారు. వీరిపై గతంలో అనేక దాడులు, హత్యలు, ఐఈడీ పేలుళ్లు, ఆస్తుల ధ్వంసం వంటి కేసులు నమోదై ఉన్నాయి.ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ నక్సల్ పునరావాస విధానం ప్రకారం, లొంగిపోయిన వారికి రూ. 50,000 తక్షణ సహాయంతో పాటు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ, వ్యవసాయ భూమి, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని అధికారులు వివరించారు. ఈ లొంగుబాటు బస్తర్‌ను నక్సల్ రహిత ప్రాంతంగా మార్చే ప్రయత్నాల్లో ఒక పెద్ద విజయమని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పట్టిలింగం పేర్కొన్నారు.

## ఈ నెల 28 నుంచి కేంద్ర బడ్జెట్ సమావేశాలు

(మొదటి పేజి తరువాయి)

కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు, పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరచడానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారని మంత్రి కిరణ్ రిజిజు తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. "2026 బడ్జెట్ సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు జరుగుతాయి. తొలి విడత సమావేశాలు ఫిబ్రవరి 13తో ముగుస్తాయి. అనంతరం మార్చి 9న సభ తిరిగి సమావేశమవుతుంది. అర్థవంతమైన చర్చలకు, ప్రజలు కేంద్రంగా సాగే పాలనకు ఈ సమావేశాలు అత్యంత కీలకం" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.నివేదికల ప్రకారం, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఫిబ్రవరి 1 ఆదివారం కావడం గమనార్హం. పార్లమెంట్ చరిత్రలో ఆదివారం రోజున బడ్జెట్ ప్రవేశపెట్టడం చాలా అరుదు. దీనికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఇక బడ్జెట్‌కు ముందు, దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరును సమీక్షించే ఆర్థిక సర్వేను జనవరి 29 లేదా 30న పార్లమెంట్ ఉభయ సభల ముందు ఉంచనున్నారు.ఈ బడ్జెట్ సమావేశాలను రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి విడత జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరుగుతుంది. ఆ తర్వాత సభకు విరామం ఉంటుంది. ఈ విరామ సమయంలో వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన పార్లమెంటరీ స్థాయీ సంఘాలు బడ్జెట్ పద్దులు, వివిధ పథకాలకు కేటాయింపులపై లోతైన సమీక్ష జరుపుతాయి. అనంతరం మార్చి 9న రెండో విడత సమావేశాలు ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి. ఈ దశలో స్థాయీ సంఘాల నివేదికలపై చర్చించి, తుది ఆమోదం తెలుపుతారు.సంప్రదాయం ప్రకారం, సమావేశాల మొదటి రోజైన జనవరి 28న పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. ఈ ప్రసంగంలో ప్రభుత్వ విధానాలు, ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికలను ఆమె వివరిస్తారు. ఆర్థిక వృద్ధి, ద్రవ్యలోటు నియంత్రణ, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన వంటి కీలక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో ఈ సమావేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పన్నులు, ప్రభుత్వ వ్యయం, విధానపరమైన సంస్కరణలపై అధికార, విపక్ష సభ్యుల మధ్య వాడివేడి చర్చలు జరిగే అవకాశం ఉంది. రాష్ట్రపతి ఆమోదంతో సమావేశాల నిర్వహణకు అధికారికంగా ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.

# రచ్చకెక్కిన బెంగాల్ రాజకీయం

(మొదటి పేజి తరువాయి)



అవినీతిలో కూరుకుపోయారంటూ తనపై బీజేపీ చేస్తున్న ఆరోపణలు, ఈడీ చర్యలపై ముఖ్యమంత్రి మమతాబెనర్జీ.. కోల్‌కతా రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు ఈడీ సైతం కోల్‌కతా హైకోర్టు విచారణపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది.ప్యాక్‌పై ఈడీ దాడులకు సంబంధించి దాఖలైన పలు పిటిషన్లపై కోల్‌కతా హైకోర్టు జస్టిస్ సువ్ర ఘోష్ విచారణ చేపట్టినప్పటికీ భారీగా జనం హాజరుకావడంతో ఆయన కోర్టు రూమ్‌ను విడిచిపెట్టి వెళ్లిపోయారు. గత వారంరోజులుగా కోర్టుకు సెలవులు ఉండగా.. ఈ అంశంపై వచ్చే బుధవారం నాడు తిరిగి విచారణ చేపట్టనున్నారు. కోల్‌కతా హైకోర్టులో కేసు విచారణ వాయిదా పడటంతో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్‌ను ఈడీ శుక్రవారం నాడు ఆశ్రయించింది. తక్షణ విచారణ కోసం ధర్మాసనం ఏర్పాటు చేయాలని కోరింది. కాగా, హైకోర్టులో శుక్రవారం విచారణ సందర్భంగా ఈడీ తమ వాదన వినిపిస్తూ, ఐప్యాక్ కార్యాలయం, జైన్ నివాసంలో తాము సోదాలు నిర్వహిస్తుండగా అధికారులతో అడ్డగించడం ద్వారా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించింది. దీనిపై జైన్, తృణమూల్ కాంగ్రెస్ కౌంటర్ పిటిషన్ దాఖలు చేసింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల వ్యూహానికి సంబంధించిన డాక్యుమెంట్లను సీజ్ చేయాలని ఈడీ ప్రయత్నించిందని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఒకవైపు కోర్టు విచారణ జరుగుతుండగా మరోవైపు ఈడీ దాడులకు నిరసనగా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ జాదవ్‌పూర్ నుంచి హజ్రా క్రాసింగ్ వరకూ 5 కిలోమీటర్ల మేరకు పాదయాత్ర నిర్వహించారు. పెద్దఎత్తున కార్యకర్తలు, పార్టీ నేతలు ఇందులో పాల్గొన్నారు. ఏం చేసైనా సరే పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో గెలవాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని మమతా బెనర్జీ, తృణమూల్ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అయితే ఈ ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చింది. టీఎంసీ చీఫ్ అవినీతి ఊబిలో కూరుకుపోయారని, ఈడీ అధికారులను బెదిరిస్తున్నారని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. మమతా చర్యల వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని.. తనను, తమ పార్టీని చిక్కుల్లోకి నెట్టే కీలకమైన సమాచారాన్ని తొలగించేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారని రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు.

## టెట్ ఫలితాలు వచ్చేశాయ్!

(మొదటి పేజి తరువాయి)ఏపీ టెట్ కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి ఫలితాల వివరాలను మీడియాకు వెల్లడించారు. టెట్‌కు మొత్తం 2,71,692 మంది దరఖాస్తు చేసుకోగా, 2,48,427 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 97,560 మంది అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల్లో ఉత్తీర్ణత శాతం కాస్త మెరుగ్గా నమోదైంది. పరీక్షకు హాజరైన 31,886 మంది ఇన్‌సర్వీస్ టీచర్లలో 15,239 మంది (47.82 శాతం) పాసయ్యారు.ప్రాథమిక కీ విడుదల తర్వాత అభ్యర్థుల నుంచి అందిన అభ్యంతరాలను నిపుణుల కమిటీతో పరిశీలించి, తుది కీతో పాటు ఫలితాలను ప్రకటించినట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులు తమ ఫలితాలను ఖజుా్వ.ఖజూఎటంం.అఅ ... ఎంవ.ఖజూ.స్త్రశీజ.అఅ వంటి అధికారిక వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకోవచ్చు. వీటితో పాటు 9552300009 అనే వాట్సాప్ నంబర్‌కు మెసేజ్ పంపి కూడా ఫలితాలను పొందవచ్చని సూచించారు.

## ఉర్దూ వర్సిటీ భూముల జోలికి రావద్దు

(మొదటి పేజి తరువాయి)

తీసుకొని రోడ్డుమీద వేయడమేనా? అని నిలదీశారు. సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్న సమస్యలపై రాహుల్ గాంధీ మాట్లాడాలి కానీ వారి భూములు గుంజుకుంటున్న తమ ప్రభుత్వంపై స్పందించకపోవడం దారుణమని కేటీఆర్ విమర్శించారు. యూనివర్సిటీలో ఉన్న భూములు ఖాళీగా ఉన్నవి కావు భవిష్యత్తు విస్తరణ కోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రతిష్టను తగ్గించేలా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. గతంలో ఇదే యూనివర్సిటీ ప్రజా అవసరాల కోసం హైదరాబాద్ నగరం కోసం 32 ఎకరాలు ఔటర్ రింగ్ రోడ్డు కోసం ఇచ్చారని, ఖాజాగూడ నుంచి నానక్ రామ్ గూడ కు లింక్ రోడ్డు కోసం ఏడెకరాల స్థలాన్ని యునివర్సిటీ భూమి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఏనాడు కూడా హైదరాబాద్ నగర ప్రయోజనాల కోసం ప్రజాప్రయోజనాల కోసం అవసరమైనప్పుడు భూసేకరణను ఏనాడు వ్యతిరేకించలేదని చెప్పారు. గతంలో తెలంగాణలో జరిగిన ఉద్యమం వల్లనే హైదరాబాద్‌లో సెంట్రల్ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ ఏర్పడిందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమాలు త్యాగాల ఆధారంగా ఏర్పడిన యూనివర్సిటీని రియల్ ఎస్టేట్ కోసం వాడటం దారుణమని మండిపడ్డారు. గతంలో మేము నిజాం కాలేజీలో హాస్టల్ లేదు అంటే ప్రభుత్వ నిధులతో హాస్టల్ కట్టించామని గుర్తుచేశారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూనివర్సిటీకి అండగా ఉంటామని స్పష్టం చేశారు. కావలసిన
విస్తరణ సౌకర్యాలకు నిధులు కూడా కేటాయించి అండగా నిలబడతామని భరోసానిచ్చారు.

# ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## సర్పంచ్ పులి రమేష్







**సంగెం, జనవరి 9 (జర్నలిస్ట్ వార్త):**
ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పులి రమేష్ అన్నారు. శుక్రవారం సంగెం మండలం రామచంద్రాపురం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి డాక్టర్ సంపత్ రావు, గవిచర్ల పశు వైద్య సహాయ శస్త్రచికిత్సాధికారి డాక్టర్ బి. రాజేష్ రెడ్డి, పర్వతగిరి పశు వైద్య సహాయ శస్త్రచికిత్సాధికారి డాక్టర్ కె. రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ పులి రమేష్ ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైద్యులు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, పాడి పశువులు ఉన్న ఇంట్లో ఎప్పటికీ కరువు ఉండదని పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో కనీసం ఒక పాడి పశువు ఉండాలని, రోజూ ఒక గ్లాస్ పాలు తాగడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. కేవలం ఆడ దూడలు పుట్టే విధంగా అవసరమైన వీర్యం అందుబాటులో ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దూడ పుట్టిన ఇరవై నాలుగు గంటలలోపు ధనుర్వాతం నివారణ ఇంజక్షన్ వేయించుకోవడం ద్వారా వ్యాధి రాకుండా నివారించవచ్చని వివరించారు. అలాగే ప్రతి రైతు కనీసం పది గుంటల భూమిలో పచ్చగడ్డి సాగు చేయాలని సూచించారు. ఆవుల్లో ఎదకాలం ఇరవై నాలుగు గంటలు, గేదెల్లో ఎదకాలం ముప్పై ఆరు గంటలు ఉంటుందని తెలిపారు. ఆవులు ఉదయం ఎదకు వచ్చినట్లయితే అదే రోజు సాయంత్రం కృత్రిమ గర్భధారణ చేయించాలని, గేదెలు ఉదయం ఎదకు వచ్చిన సందర్భంలో మరుసటి రోజు ఉదయం కృత్రిమ గర్భధారణ చేయించాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో మొత్తం అరవై ఒకటి పశువులకు వైద్య సేవలు అందించారు. వీటిలో ఇరవై ఎనిమిది ఎదకు రాని పశువులు, ఇరవై ఐదు దూడలకు నట్టల నివారణ మందులు, పదమూడు గర్భకోశ వ్యాధుల కేసులు, మరో పదమూడు పశువులకు సాధారణ చికిత్సలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గోపాలమిత్ర పర్యవేక్షకుడు ముజ్జిగ అనిల్ రావు, గోపాలమిత్రులు కారింగుల రాజు, వీరేశం తదితరులు, గ్రామ పాడి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వన దేవతల ఘన కీర్తి ప్రపంచానికి చాటాలి

### చరిత్రలో ప్రత్యేక మైలు రాయిగా మేడారం ఆలయం -గిరిజన సంస్కృతి ప్రతిబింబించేలా ఆలయ ప్రాంగణ పునరుద్ధరణ

### మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ -రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క వెల్లడి



**వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరో తాడ్వాయి (ములుగు జిల్లా), జనవరి9 (జర్నలిస్ట్ వార్త):**
ప్రపంచ చరిత్రలోనే ప్రత్యేక మైలు రాయిగా నిలిచే మేడారం ఆలయ ఘనతను ప్రపంచానికి చాటి చెప్పాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా--శిశు సంక్షమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.
గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, గొట్టు--గోత్రాల ఆచారాలు ప్రతిబింబించేలా మేడారం ఆలయ ప్రాంగణ పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయని, ప్రపంచానికి ఆదివాసులు మూల పురుషులని నిరూపించేలా అభివృద్ధి ప్రణాళిక రూపొందించామని చెప్పారు. మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ పెట్టి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని వెల్లడించారు.
శుక్రవారం ఎస్.ఎస్. తాడ్వాయి మండలంలోని మేడారం హరిత హోటల్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌తో కలిసి నిర్వహించిన మీడియా ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు.

**251 కోట్లతో కనివిని ఎరుగని ఏర్పాట్లు**

తెలంగాణ ప్రజా ప్రభుత్వం రూ.251 కోట్ల నిధులతో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మేడారం జాతర నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోందని మంత్రి తెలిపారు. శాశ్వత ప్రతిపాదికన చేపడుతున్న అభివృద్ధి పనులు, జాతర నిర్వహణ అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మీడియా ప్రతినిధులను కోరారు.
భక్తుల కొంగు బంగారం సమ్మక్క--సారలమ్మ
భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా, ఇంటి ఇలవేల్పులుగా సమ్మక్క--సారలమ్మ దేవతలు ప్రసిద్ధి చెందారని మంత్రి గుర్తు చేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి వెన్నెల వెలుగుల్లో గిరిజన డోలు వాయిద్యాల నడుమ, జిల్లా అధికారుల గౌరవ వందనంతో గిరిజన నృత్యాల మధ్య వన దేవతలు గద్దెలపైకి రావడం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తుతుందని అన్నారు. ఈ మహాద్భుత ఘట్టాన్ని ఆవిష్కరించేందుకు కోట్లాది మంది భక్తులు ఎదురుచూస్తున్నారని తెలిపారు.

**19న గద్దెల పునరుద్ధరణ ప్రారంభం**

గద్దెల పునరుద్ధరణ పనులను ఈ నెల 19వ తేదీ ఉదయం 7 గంటలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. 18వ తేదీ సాయంత్రం ముఖ్యమంత్రి మేడారం చేరుకుంటారని, గద్దెల పునరుద్ధరణ ప్రారంభ కార్యక్రమానికి ప్రజలంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**అందరి సమ్మతితో మాస్టర్ ప్లాన్**

ఆలయ పునరుద్ధరణ విషయమై గిరిజన పెద్దలు, పూజారులు, ఆదివాసీ సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామని, అందరి సమ్మతి, సంతకాలతో అభివృద్ధి పనులు ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి వివరించారు. జాతరలో మహిళా సంఘాల సభ్యులకు ప్రాధాన్యత ఇస్తూ బొంగు చికెన్, ఇప్పపువ్వు లడ్డూ ప్రత్యేక దుకాణాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

**జిల్లా యంత్రాంగం పూర్తి సన్నద్ధం**

జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మేడారం జాతర నిర్వహిస్తోందని, జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రస్తుతం 5 వేల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, జాతర సమయంలో 30 వేల మంది, అనంతరం 5 వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. జాతర ప్రాంతాన్ని 8 జోన్లు, 42 సెక్టార్లుగా విభజించి ప్రతి జోన్‌కు 8 మంది అధికారులను నియమించినట్లు వెల్లడించారు.

**భక్తుల భద్రతకే తొలి ప్రాధాన్యం**



జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ మాట్లాడుతూ మేడారం జాతర సమయంలో భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమగ్ర ప్రణాళికతో చర్యలు చేపట్టామని చెప్పారు. తాడ్వాయి--మేడారం, పసర--మేడారం రహదారుల వెంట ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.
జాతర నిర్వహణకు సుమారు 20 మంది ఐపీఎస్ అధికారుల సేవలను వినియోగిస్తున్నామని, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. 450 సీసీటీవీ కెమెరాలు, 20 ప్రత్యేక డ్రోన్ల ద్వారా నిఘా కొనసాగుతుందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హీట్‌మ్యాప్ టెక్నాలజీతో గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని వివరించారు. కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా క్రౌడ్ మేనేజ్‌మెంట్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, వరంగల్--ములుగు జిల్లాల మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పోటీ పరీక్షలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

### అభినందించిన ప్రధానోపాధ్యాయులు రమేష్





**భీమదేవరపల్లి/జనవరి9(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటి)లో హనుమకొండ జిల్లా స్థాయి ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంగ్లీష్ ఒలంపియాడ్ రాత, మౌఖిక పరీక్ష నిర్వహించారు. శుక్రవారం జరిగిన పోటీలలో గట్లనర్సింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరీ బా గాంధీ, గురుకులాలు, మోడల్ పాఠశాల పాల్గొన్నారు. స్ట్రీమ్ వన్ లోని జిల్లా పరిషత్, గవర్నమెంట్ హైస్కూల్స్ విభాగంలో జిల్లా రాత, మౌఖిక పరీక్ష విభాగంలో ప్రథమ బహుమతి సాధించిన పదవ తరగతి విద్యార్థిని గడిపె ఉత్తేజిత, రాష్ట్రస్థాయి ఇంగ్లీష్ కాంపిటీషన్ కు ఎంపికయ్యారు. ఇంగ్లీష్ ఒలంపియాడ్ విభాగంలో ఎనిమిదవ తరగతి విద్యార్థిని యు.రిషిత జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను ప్రోత్సాహం అందించిన ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు కామారపు శ్రీనివాసు, ఉపాధ్యాయురాలు కె.అనిత లను ప్రధానోపాధ్యాయులు డి.రమేష్, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

## గన్నారం ఉచిత గర్భ కోశ వ్యాధుల చికిత్సా శిబిరం



**రాయపర్తి/జనవరి 9(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని గన్నారం గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ,పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల పశువైద్యాధికారిని డాక్టర్ శృతి,గ్రామ సర్పంచ్ గడ్డం విజయసమ్మయ్య పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మండల పశువైద్యాదికారిని శృతి మాట్లాడుతూ కవ్వమాడిన ఇంట్లో కరువుండదని ప్రతీ ఇంట్లో పాడి పశువులు ఉండాలని అన్నారు.ప్రతి ఒక్కరూ రోజు ఒక్క గ్లాస్ పాలు తాగడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.కేవలం ఆడ దూడలు పుట్టే విధంగా సెమెన్ అందుబాటులో ఉంది రైతులు సద్వినియోగించుకోవాలని కోరారు.దూడ పుట్టిన 24 గంటల లోపల టీటీ ఇంజక్షన్ వేయించుకోవడం వలన ధనుర్వాతం రాకుండా నివారించవచ్చునీ అన్నారు.ప్రతి రైతు కనీసం 10 గుంటల భూమిలో పచ్చగడ్డి వేసుకోవాలని సూచించారు. ఆవులలో ఎదకాలం 24 గంటలు ఉంటుందనీ, గేదెలలో ఎదకాలం 36 గంటలు ఉంటుంది. కావున రైతులు ఆవులు ఉదయం ఎదకు వస్తే సాయంత్రం కృత్రిమ గర్భధారణ చేయించాలి అలాగే గేదెలు ఉదయం ఎదకు వచ్చిన సందర్భంలో మరుసటి రోజు ఉదయం కృత్రిమ గర్భధారణ చేయించాలని సూచించారు.శిబిరంలోపశువులకు చికిత్స అందించి వాటికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది.61పశువులు రాగా 28ఎదకు రాని 25దూడలకు నట్టల నివారణ మందులు 13 గర్భకోశ వ్యాధులు, 13 పశువులకు సాధారణ చికిత్స అందించడం జరిగిందనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో గూగూ వెంకటయ్య,వాూ గణేష్. గోపాలమిత్రులు.బానోత్ రమేష్ , సిహెచ్ రమెష్ తదితరులు పాల్గొన్నారు.

# సస్య రక్షణ పద్ధతితో అధిక దిగుబడులు



**రాయపర్తి/జనవరి 9(జర్నలిస్ట్ వార్త):** సస్య రక్షణ పద్ధతితో మొక్కజొన్న లో అధిక దిగుబడులు పొందవచ్చని ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి హోన్నప్ప అన్నారు.మండలంలోని మహబూబ్ నగర్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ వారి కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం, హైదరాబాద్ ఆధ్వర్యంలో మొక్కజొన్న లో రైతు క్షేత్ర పాఠశాల నిర్వహించారు. ఈ సందర్భంగా హోన్నప్ప మాట్లాడుతూ రైతులకు సమగ్ర సస్య రక్షణ అవసరం గురించి వివరించారు. విత్తన శుద్ధి ఎలా చేయాలో డెమో చూపించారు. రైతులు తప్పనిసరిగా సమగ్ర సస్య రక్షణ పద్ధతులు పాటించాలని, రసాయన పురుగు మందులను తగ్గించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి ఉదయ్ శంకర్,మండల వ్యవసాయ అధికారి వీరభద్రశీ,గ్రామ సర్పంచ్ మహేందర్ రెడ్డి,ఉప సర్పంచ్ రవి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ బలోపేతానికి కృషి చెయ్యాలి

### నియోజకవర్గ టీడీపీ అడ్ హక్ కమిటీ సభ్యులు వట్టం నారాయణ



**మణుగూరు/జనవరి9(జర్నలిస్ట్ వార్త);** టీడీపీ బలోపేతానికి కృషి చెయ్యాలని నియోజకవర్గ టీడీపీ అడ్ హక్ కమిటీ సభ్యులు వట్టం నారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్లో తెలుగుదేశం పార్టీ పినపాక నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పినపాక నియోజకవర్గ టీడీపీ అడ్ హక్ కమిటీ సభ్యులు వట్టం నారాయణ మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే అసలైన బలం. స్థానికంగా టిడిపి మరింత బలోపేతం కావాలంటే, ప్రతి ఒక్కరు తమ బాధ్యతను నిర్వర్తించాలి. ప్రతి గ్రామంలోనూ, ప్రతి బూత్ స్థాయిలోనూ టిడిపి శ్రేణులు సమర్థవంతంగా పని చేయాలని కోరారు. భవిష్యత్తు టీడీపీ పార్టీ క్రియాశీలంగా ఎదుగుతుందని భరోసానిచ్చరు. 23 తారీకు నుండి నియోజవర్గ వ్యాప్తంగా ఉన్న తెలుగుదేశం పార్టీ దిమ్మెల వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నియోజవర్గ మండల మాజీ అధ్యక్షులు దొడ్డి కిష్ట, సిరిశెట్టి కమలాకర్, తోట వెంకటేశ్వర్లు, పరమేష్ మాజీ సర్పంచ్ బచ్చల భారతి మాజీ రాష్ట్ర ఎస్ టీ సెల్ కార్యదర్శి పాయం లక్ష్మి నారాయణ టౌన్ అధ్యక్షులు పూర్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి బోళ్ళ ఆంజనేయులు పట్టణ కోశాధికారి ముసునూరి చందర్ రావు, మండల ప్రధాన కార్యదర్శి మద్దెల భద్రయ్య, పార్టీ సీనియర్ నేతలు యార్లగడ్డ రాజా, ముమ్మినేని సత్యనారాయణ, వాసు, భాస్కర్, చావా రామారావు, చావా శ్రీదేవీ, ఖమురిన్న బేగం దర్పునేని హరి, బచ్చల సుమేష్ తదితరులు పాల్గొన్నారు.ం

# లూర్దు మాత హైస్కూల్ నారాయణపురం




**అల్పాహారం వితరణ తల్లాడ/జనవరి9(జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ లయన్స్ క్లబ్ అధ్యక్షులు కోడూరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఏపీ సింగ్ జన్మదినోత్సవం సందర్భంగా అంగర్ రిలీఫ్ వీక్ గా ప్రకటించి ప్రతిరోజు అన్నదానం చేస్తున్నాం ఆ సందర్భంగా శుక్రవారం నారాయణపురం లూర్దు మాత హైస్కూల్ నందు విద్యార్థులకు స్నాక్స్ (అల్పాహారం) వితరణ. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డిస్టిక్ జాయింట్ సెక్రెటరీదారా శ్రీనివాసరావు , డిస్టిక్ జాయింట్ కోఆర్డినేటర్ కర్నాటి లక్ష్మారెడ్డి, జెడ్ సి బెల్లంకొండ ఆంజనేయులు , మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఏపీ సింగ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని అంగర్ రిలీఫ్ వీక్ గా ప్రకటించి ఈ వారం రోజులు ప్రతిరోజు అన్న ప్రసాదం వితరణ నిర్ణయించి. 7వ రోజు లూర్దు మాత హైస్కూల్ నందు విద్యార్థిని విద్యార్థులకు అల్పాహారం వితరణ . డిసి వేమిరెడ్డి వెంకట్ నారాయణరెడ్డి స్పాన్సర్ చేసినారు వారికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నాము అన్నారు. పిల్లలందరూ చక్కగా కష్టపడి చదువుకొని పై స్థాయికి వెళ్ళాలని కోరారు, ఈ కార్యక్రమంలో సెక్రెటరీ నంబూరు కనకదుర్గ ప్రసాద్ మాజీ సెక్రటరీ కిటికీ వెంకటేశ్వరరావు,తోట మురళి, హెచ్ఎం ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థిలు తదితరులు పాల్గొన్నారు.

# భూవివాదం పై గ్రామసభ




**తల్లాడ/జనవరి9(జర్నలిస్ట్ వార్త);**మండలం పరిధిలో అంజనాపురం గ్రామం అభయాంజనేయ స్వామి దేవాలయం భూమి వివాదం పై గ్రామపంచాయతీ కార్యాలయంలో కల్లూరు సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ తాసిల్దార్ గ్రామసభ నిర్వహించారు గ్రామ సభలో తహసీల్దార్ కరుణాకర్ రెడ్డి అభయాంజనేయ స్వామి దేవాలయం భూమి వివాదంపై గ్రామ ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దేవాలయం సంబంధించిన భూమి కోర్టులో నడుస్తున్న దృష్ట్యా దేవాలయం ధూపదీప నైవేద్యాలకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గ్రామస్తుల సహకారంతో ఇరువర్గాలకు అనుకూలంగా కమిటీ నియామకం లేక ప్రభుత్వ ఎండోమెంట్ ద్వారా అర్జిత సేవలు కొనసాగించేందుకు అవకాశం కల్పించాలని గ్రామ సభలో చర్చించారు. దీనికి ఇరువర్గాలు ఒప్పుకోకపోవడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది దీంతో గ్రామసభను వాయిదా వేశారు. గ్రామసభలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా తల్లాడ ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామసభలో ఎంపీడీవో సురేష్ సర్పంచ్ నల్ల గొర్ల రాధ ఉప సర్పంచ్ కేతినేని చలపతిరావు ఎస్సై వెంకటేష్ నందిగామ శ్రావణి జయమ్మ రుక్మిణి అరుణ అనుమోలు రామారావు కొమ్మినేని ప్రభాకర్ రావు రామారావు గ్రామ పంచాయతీ కార్యదర్శి రెవెన్యూ సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.ం

## త్రివేణి పాఠశాల లో ఘనంగా సంక్రాంతి ఉత్సవాలు



**సత్తుపల్లి/జనవరి9(జర్నలిస్ట్ వార్త):**త్రివేణి పాఠశాల, సత్తుపల్లి శాఖలో సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసిస్టెంట్ ఆర్డీఓ రాజశేఖర్ రెడ్డి హాజరై, విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ విలువైన సూచనలు, మార్గదర్శకత అందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు.అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. సరిత విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పండుగల ప్రాముఖ్యతను వివరిస్తూ విలువైన ప్రసంగం చేశారు. విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో క్యాంపస్ ఇన్‌చార్జ్ వంశీ , కిడ్స్ ఇన్‌చార్జ్ శ్రీ పద్మ, అకడమిక్ ఇన్‌చార్జ్ పవన్ లు కూడా విద్యార్థులను ఉద్దేశించి తమ సందేశాలను అందించారు.అలాగే త్రివేణి పాఠశాల సీఆర్వో మురళీకృష్ణ విద్యార్థులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల డైరెక్టర్ జి. వీరేంద్ర చౌదరి కూడా విద్యార్థులకు, యాజమాన్యానికి తన హృదయపూర్వక సంక్రాంతి శుభాకాంక్షలు పంపించారు.ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని సంక్రాంతి సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు.ం

## చల్లా సుధీర్ రెడ్డి సన్మానించిన పాఠశాల యాజమాన్యం




**స్టేషన్ ఘన్ పూర్/జనవరి9 (జర్నలిస్ట్ వార్త) :**మండలంలోని తాటికొండ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో వివిధ అభివృద్ధి పనులకు విరాళాలు అందజేసిన దాతలకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచ్,వార్డు సభ్య లకు సన్మానాన్ని ఘనంగానిర్వహించారు. ఉన్నత పాఠశాలలో సభా ప్రాంగణాన్ని ఏర్పాటుచేసిన దాత చల్లా సుధీర్ రెడ్డిని, నూతన గేటు ఏర్పాటు చేసిన2000 -2001 పదవ తరగతివిద్యార్థులను పాఠశాల నూతన బోర్డు ఏర్పాటుచేసిన రిటైర్డ్ టీచర్ రుద్రమదేవిని పాఠశాలలో ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ మారపాక సృజన, ఉపసర్పంచ్ ఎడమ కట్టుమళు ,,వార్డుసభ్యులందరినీ ఈ కార్య క్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భం గా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెనుమాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి లోభాగమైన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశా రు. మరికొంతమంది దాతలు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రుద్ర, లింగ మూర్తి, రంజిత్ కుమార్, శ్రీనివాస్, రవీందర్, మురళి, అనసూయ, కృపమ్మ, సలావుద్దీన్, ప్రమోద్ రెడ్డి, రవి, సువర్ణ, గ్రామస్తులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ప్రారంభం



**భీమదేవరపల్లి/జనవరి (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ఆధార్ కేంద్రం లేక మండల వాసులు దూరప్రాంతలలో ఆధార్ సేవల కోసం వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఎంపిడివో వీరేశం ఆధార్ శాశ్వత కేంద్రం ప్రారంభించారు. మండల ప్రజలు ఆధార్ సేవలు వినియోగించుకోవాలని సెంటర్ నిర్వాహకుడు పోలు అనిల్ కోరారు. చాలాకాలంగా ఎదిరి చూస్తున్న ఆధార్ సెంటర్ ఏర్పాటుతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తొలగనున్నాయి. కొత్త ఆధార్ కార్డు జారీ, చిరునామా మార్పులు, పేర్లు, పుట్టిన తేదీల సవరణ వంటి సేవలు ఆధార్ కేంద్రంలో అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు

# వ్యసనాల ఉచ్చు లో యువత
# విద్యను కోల్పోతున్న దేశ భవిష్యత్తు




దేశాన్ని ముందుకు నడిపించాల్సిన యువత ఈ రోజుల్లో చెడు వ్యసనాల ఉచ్చులో చిక్కుకుని విద్యకు దూరమవుతున్న పరిస్థితి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. శక్తి, ఉత్సాహం, ఆశయాలతో దేశాభివృద్ధికి దోహదపడాల్సిన వయసులో తాత్కాలిక ఆనందాల మాయలో పడి జీవితాన్నే పణంగా పెట్టేస్తున్నారు. ఇది కేవలం యువత సమస్య మాత్రమే కాదు దేశ భవిష్యత్తుకు ఎదురైన పెద్ద సవాల్.

మద్యం, మత్తు పదార్థాలు, పొగాకు వంటి వ్యసనాలతో పాటు మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలపై అతిగా ఆధారపడటం యువతను చదువుకు దూరం చేస్తోంది. మొదట సరదాగా ప్రారంభమైన అలవాట్లు క్రమంగా బానిసత్వంగా మారి లక్ష్యాలను చెదరగొడుతున్నాయి. తరగతి గదుల నుంచి యువత నెమ్మదిగా బయటకు జారిపోతుండగా, వీధులు, అలవాట్లకు కేంద్రాలుగా మారుతున్నాయి. ఇది విద్యా వ్యవస్థకు మాత్రమే కాకుండా సామాజిక వ్యవస్థకూ గట్టి దెబ్బ.

విద్యా ప్రమాణాలు పడిపోవడం, నిరుద్యోగం పెరగడం, నేరప్రవృత్తులు బలపడటం ఇవన్నీ ఒకే గొలుసులో భాగాలు. యువత చదువును మధ్యలోనే వదిలేస్తే వారి జీవితాలు మాత్రమే కాదు, కుటుంబాల భవిష్యత్తు కూడా అంధకారమవుతుంది. ఒక తరం తప్పుదోవ పట్టితే దాని ప్రభావం తరతరాలకు విస్తరిస్తుంది.

విద్య అనేది కేవలం ఉపాధి సాధన కాదు. అది మనిషిని మనిషిగా తీర్చిదిద్దే ప్రక్రియ. జ్ఞానం మనిషికి ఆలోచన శక్తిని, నిర్ణయ సామర్థ్యాన్ని, బాధ్యతను నేర్పుతుంది. జ్ఞానం ఉన్నచోటే వివేకం ఉంటుంది. అందుకే “జ్ఞానం ఉంటే ఏదైనా సాధించవచ్చు” అన్న మాట నేటి యువతకు మరింత అవసరం. విద్యే వ్యసనాలకు అడ్డుకట్ట వేసే బలమైన ఆయుధం.

యువత వ్యసనాల వైపు మళ్లడానికి కారణాలు ఒక్కటే కాదు. కుటుంబ పర్యవేక్షణ లోపం, మారుతున్న జీవనశైలి, పోటీ ఒత్తిళ్లు, ఉపాధి భయం, విలువల క్షణత ఇవన్నీ కలిసి యువతను బలహీనంగా మారుస్తున్నాయి. ఈ ఖాళీని వ్యసనాలు ఆక్రమిస్తున్నాయి. సమస్య మూలాల్లోకి వెళ్లకుండా కేవలం ఉపరితలంపై చర్యలు తీసుకుంటే పరిష్కారం దొరకదు.

యువతను తప్పుదారి పట్టకుండా చేయాల్సిన బాధ్యత కేవలం యువతదే కాదు. కుటుంబం, విద్యాసంస్థలు, సమాజం, ప్రభుత్వం---అన్నీ సమిష్టిగా స్పందించాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు పిల్లలతో సంభాషణ పెంచాలి. ఆదేశాలు ఇవ్వడం కాదు, అవగాహన కల్పించాలి. ఉపాధ్యాయులు మార్కులు, ర్యాంకులకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో జీవన విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించాలి.

ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను కేంద్రంగా పెట్టుకుని దీర్ఘకాలిక విధానాలు రూపొందించాలి. మత్తు పదార్థాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడం అత్యవసరం. విద్యాసంస్థల పరిసరాల్లో పర్యవేక్షణ పెంచాలి. వ్యసనాలకు పాల్పడిన యువతను శిక్షించే దానికన్నా, పునరావాసం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలి.

అదే సమయంలో ప్రతి మండలంలో క్రీడా మైదానాలు, యువజన కేంద్రాలు, గ్రంథలయాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఉపాధి ఆధారిత విద్యను ప్రోత్సహించాలి. కెరీర్ మార్గదర్శక కార్యక్రమాలు, మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్ కేంద్రాలు విస్తరించాలి. చదువుతో పాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో యువతను భాగస్వాములను చేస్తేనే వారి శక్తి సానుకూల దిశలో మళ్లుతుంది.

యువతను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా భావించినప్పుడే దేశానికి భవిష్యత్తు భద్రమవుతుంది. ఈ పెట్టుబడిని నిర్లక్ష్యం చేస్తే దేశం తీరని నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది. చెడు వ్యసనాలకు బానిసైన యువతతో అభివృద్ధి సాధ్యం కాదు. జ్ఞానంతో, క్రమశిక్షణతో, విలువలతో ఎదిగిన యువతే దేశానికి నిజమైన బలం. దేశానికి ఊపిరి యువతే. ఆ ఊపిరి వ్యసనాల పొగలో మసకబారితే రేపటి భారతం అంధకారమవుతుంది. జ్ఞాన దీపాన్ని వెలిగించడమే ఏకైక మార్గం. యువత విద్యవైపు మళ్లితేనే దేశ భవిష్యత్తు వెలుగులమయం అవుతుంది.



సీనియర్ జర్నలిస్ట్
కొట్టె లెనిన్ సుధాకర్

# ఐనవోలు జాతరకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేయాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశం



**ఐనవోలు/జనవరి9 (జర్నలిస్ట్ వార్త)**
ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పటిష్ట ఏర్పాట్లు పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు.

ఈ నెల 13 నుంచి ప్రారంభం కానున్న ఐనవోలు జాతర ఉత్సవాల నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ ఆలయ పరిసరాల్లో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. దేవాదాయ, పంచాయతీరాజ్, మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దర్శనాలు, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్, భద్రత వంటి అన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. జాతర ప్రారంభానికి ముందే పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు.

అంతకు ముందు ఆలయానికి చేరుకున్న కలెక్టర్‌కు అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అధికారులతో జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కమ్మగొని ప్రభాకర్, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి కందుల సుధాకర్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మ రమాకాంత్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, సీఎం హెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, తహసిల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో నర్మద, ఎస్సై శ్రీనివాస్, ఏఈలు రవికుమార్, సురేష్ కుమార్, ఆలయ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి పెళ్లిళ్లకు ప్రభుత్వ భరోసా

### కొండంత అండగా ‘కళ్యాణ లక్ష్మి’ఎమ్మెల్యే కడియం శ్రీహరి




**హనుమకొండ బ్యూరో/ధర్మసాగర్,**
**వేలేరు జనవరి 9 (జర్నలిస్ట్ వార్త):**
పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని, కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా గట్టి ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. పేద వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ధర్మసాగర్, వేలేరులో చెక్కుల పంపిణీధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో, అలాగే వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదికలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.లక్షల రూపాయల ఆర్థిక సహాయంఈ సందర్భంగా ధర్మసాగర్ మండలానికి చెందిన 29 మంది కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు రూ.29,03,364, అలాగే 22 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.9,55,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.అలాగే వేలేరు మండలానికి చెందిన 16 మంది కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు రూ.16,01,856, 15 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.3,21,500 విలువైన చెక్కులను అందజేశారు.రూ.1,11,116తో పెళ్లిళ్లకు అండఅనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లి తల్లిదండ్రులకు భారమవుతుందని, అయితే కళ్యాణ లక్ష్మి పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న రూ.1,11,116 ఆర్థిక సహాయం వారికి పెద్ద ఊరటనిచ్చిందన్నారు.సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంకాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే రైతులు, మహిళలు, పేద వర్గాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పథకాలు ప్రజలకు మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్లలో రాష్ట్రంలోనే అగ్రస్థానంఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని ఎమ్మెల్యే తెలిపారు. అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు.ఒక్క రూపాయి కూడా అవసరం లేదుప్రభుత్వ పథకాల కోసం ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళు ,, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ సహా అన్ని పథకాలు నేరుగా అర్హులైన లబ్ధిదారులకే అందుతున్నాయని తెలిపారు. ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలకు భిన్నంగా నియోజకవర్గంలో అవినీతిరహిత పాలన అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ తాసిల్దార్ సదానందం వేలేరు తాసిల్దార్ సర్పంచులు , తదితర నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచుల ఫోరమ్ మండల కమిటీ ఎన్నిక

## అధ్యక్షులు తాళ్ల అరవింద్, ప్రధాన కార్యదర్శి మాట్ల హరికుమార్





అధ్యక్షులు తాళ్ల అరవింద్,



ప్రధాన కార్యదర్శి మాట్ల హరికుమార్

**భీమదేవరపల్లి**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల ఉప సర్పంచుల ఫోరం ఎన్నిక శుక్రవారం ముస్తఫాపూర్ బిఆర్ కె ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు కేతిరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఉప సర్పంచుల ఫోరం ఎన్నిక జరిగింది. ఫోరం మండల అధ్యక్షులుగా ముస్తఫాపూర్ ఉపసర్పంచ్ తాళ్ల అరవింద్ గౌడ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రంగయ్యపల్లి, ధర్మారం, రాంనగర్, ఎర్రబెల్లి, కొత్తపల్లి, మల్లారం ఉపసర్పంచులు ఎలబోయిన రజిత, కొత్తపల్లి కళ్యాణి, భూక్య తిరుపతి, మాలోతు శోభ, బోడ రవీందర్, నారగోని సుమన్, ప్రధాన కార్యదర్శి ముత్తారం ఉపసర్పంచ్ మాట్ల హరికుమార్, బొడిగె శ్రీనివాస్, కార్యదర్శులుగా బొల్లోనిపల్లి, రసూల్ పల్లి, వీర్లగడ్డ తండా, వీరభద్ర నగర్, విశ్వనాథ కాలనీ ఉపసర్పంచులు బొల్లి సుమన్, కందుల అనిల్ కుమార్, గుగులోతు హరిలాల్, పాక సంపత్, కస్తూరి మల్లేష్, సంయుక్త కార్యదర్శిగా మాణిక్యాపూర్, రత్నగిరి ఉప సర్పంచులు మాచనపల్లి శ్రీనివాస్, గూడెల్లి రజిత, కోశాధికారి గాంధీనగర్, కొప్పూర్ ఉప సర్పంచులు బుర్ర సమ్మయ్య, మిర్యాల రాణి, కార్యవర్గ సభ్యులు సాయి నగర్, చంటయ్యపల్లి, కొత్తకొండ ఉపసర్పంచులు నాయిని రవీందర్, ముప్పు సాయి చంద్ర, తాళ్లపల్లి యాదగిరి, గౌరవ సలహాదారులుగా వంగర, గొల్లపల్లి, ముల్కనూర్ ఉపసర్పంచులు వొల్లాల రమేష్, ఎల్ది రాజు, కాసగోని మమత బాలకృష్ణలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపి శాలువతో సన్మానం చేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిట్టంపల్లి ఐలయ్య, సీనియర్ నాయకులు కొలుగూరి రాజు, ఊసకోయిల ప్రకాష్, రమేష్, మహేష్, కరుణాకర్ వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ముదిరాజ్ రాష్ట్ర నాయకుడు కల్నల్ డాక్టర్ బిక్షపతి



**స్టేషన్ ఘన్ పూర్/జనవరి9 (జర్నలిస్ట్ వార్త):**మండలంలోని తాటికొండ గ్రామంలో మల్లన్న గండి రిజర్వాయర్ మత్య సొసైటీ డైరెక్టర్ నార బోయిన మల్లేశం ఇటీవల మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు, జనగామ జనరల్ ఆస్పత్రి ప్రొఫెసర్, మాజీ సైనికుడు డాక్టర్ కల్నల్ బిక్షపతి, ముదిరాజ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల సదానందం ముదిరాజ్ శుక్రవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, 50 కేజీల బియ్యం అందజేశారు. మృతుని కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటామని అధర్యపడొద్దు అండగా ఉంటామని వారికిధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమం లో ముదిరాజ్ మహాసభ మండల నాయకుడు, మాజీ ఎంపిటిసి గోనెల రాజయ్య,వార్డు సభ్యుడు పండుగ నరసయ్య, ముదిరాజ్ మహాసభ మండ ల గౌరవ అధ్యక్షుడు నారబోయిన గోపాల్, ముది రాజ్ కుల పెద్దమనిషి నారదాస్ కుమార్, నారా బోయిన శ్రీనివాస్, నారబోయిన యాదగిరి, నార బోయిన తిరుపతి,గుర్రపు దశరథం,గుర్రపు బుచ్చయ్య, మారబోయిన ఎల్లస్వామి, బోయిని ఎల్లయ్య,నారబోయిన వెంకటరాజు, నారబోయిన మల్లేష్, సాయిరెడ్డి పెద్దపురం, సాయిరెడ్డి అశోక్, గూడేల్లి రాజు,నారబోయిన యాదగిరి,నారబోయి న వెంకటయ్య, నాగరాజు,రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ




**రాయపర్తి/జనవరి 9(జర్నలిస్ట్ వార్త):**

మండలంలోని వెంకటేశ్వర పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుదగాని కుమారస్వామి ఆనారోగ్యంతో మరణించగా శుక్రవారం ఆయన పార్థివ దేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షడు ఈదులకంటి రవీందర్ రెడ్డి పూలమాలవేసి నివాళులు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట గ్రామ పార్టీ అధ్యక్షుడు కొనుకటి రవీందర్ రెడ్డి,సర్పంచ్ సంకినేని సారయ్య,ఉప సర్పంచ్ మంద రాజు వార్డు మెంబర్ సుదగాని నారాయణ,మాజీ ఎంపీటీసీ గోవింద్,ఏసిరెడ్డి మోహన్ రెడ్డి ,నకిరెడ్డి రాజు,మంద. యాకుబ్ రెడ్డి ,అవునూరి శ్రీను,కొనుకటి సోమయ్య, కొనుకటి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సర్పంచులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి.

## స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్ ఘన్ పూర్/జనవరి 9(జర్నలిస్ట్ వార్త) :**



నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల అభి వృద్ధి కోసం, అవినీతి, అక్రమాలకు దూరంగా ప్రజల సంక్షేమానికి పని చేస్తే నా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు తెలిపారు. చిల్పూర్ మండల కేంద్రం లోని వరలక్ష్మిగార్డెన్స్ లో ఏర్పాటుచేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఎక్కడా అవినీతి, అక్రమాలకు అవకాశం లేకుండా సంక్షేమ పథకాల ను అమలు చేస్తున్నామని తెలిపారు. కల్యాణ లక్ష్మి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న 3 నెలలో చెక్కులు అందజేస్తున్నామని, ఇందుకు ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవరైనా డబ్బులు అడిగితే తన కు చెప్పాలని సూచించారు. రాష్ట్రంలో పేద వర్గా ల ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని అన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ నిలుస్తుందని అన్నారు. మనం ఎంత బాగాపనిచేస్తామో ఎంతనిజాయితీగా ఉంటామో దానిని బట్టే ప్రజలలో గుర్తింపు ఉంటుందని అన్నారు. త్వరలోనే చిల్పూర్ మండల కేంద్రంలో మండల కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తానని తెలిపారు. వాటి నిర్మాణం ఏడాదిలో పూర్తి చేసి మండల ప్రజలకు బహుమానంగా అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్పూరు గుట్ట ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, తహసీల్దార్, ఎంపిడివో, ఫతేపూర్ సర్పంచ్ గుగులోతు లక్ష్మి ఉమ్లా నాయక్, నాయ కులు సురేష్, బాలరాజు, రంజిత్ రెడ్డి, మల్లారెడ్డి సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకు లు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పూజల పేరుతో భారీ మోసం

## ఇద్దరు అరెస్ట్ -రూ.9 లక్షలు నగదు, కార్లు స్వాధీనం



**హనుమకొండ బ్యూరో ధర్మసాగర్/జనవరి 9 (జర్నలిస్ట్ వార్త):** పూజల పేరుతో డబ్బులు ఎక్కువ వస్తాయని నమ్మించి ప్రజలను మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల పోలీసులు శుక్రవారం ఈ అరెస్టులు చేపట్టారు. అరెస్టైన నిందితులు ముప్ప తిరుపతి (తండ్రి: పంచాక్షరి, వయసు 55, నివాసం: కుషాయిగూడ, హైదరాబాద్) మరియు చెల్పూరి అజయ్ (తండ్రి: రాజు, వయసు 23, నివాసం: పెద్ద చర్లపల్లి, హైదరాబాద్)గా పోలీసులు గుర్తించారు. వీరిలో ముప్ప తిరుపతి వద్ద నుంచి రూ. 9,00,000 నగదు, ఒక ఇన్నోవా కారు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకోగా, చెల్పూరి అజయ్ వద్ద నుంచి ఒక ఎర్టిగా కారు, ఒక బుల్లెట్ ద్విచక్ర వాహనం, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ధర్మసాగర్ మండల ఎస్‌హెచ్‌ఓ శ్రీధర్ రావు తెలిపారు.


# నూతన సర్పంచులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి.

## స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్ ఘన్ పూర్/జనవరి 9(జర్నలిస్ట్ వార్త) :**

నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల అభి వృద్ధి కోసం, అవినీతి, అక్రమాలకు దూరంగా ప్రజల సంక్షేమానికి పని చేస్తే నా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు తెలిపారు. చిల్పూర్ మండల కేంద్రం లోని వరలక్ష్మిగార్డెన్స్ లో ఏర్పాటుచేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఎక్కడా అవినీతి, అక్రమాలకు అవకాశం లేకుండా సంక్షేమ పథకాల ను అమలు చేస్తున్నామని తెలిపారు. కల్యాణ లక్ష్మి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న 3 నెలలో చెక్కులు అందజేస్తున్నామని, ఇందుకు ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవరైనా డబ్బులు అడిగితే తన కు చెప్పాలని సూచించారు. రాష్ట్రంలో పేద వర్గా ల ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని అన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ నిలుస్తుందని అన్నారు. మనం ఎంత బాగాపనిచేస్తామో ఎంతనిజాయితీగా ఉంటామో దానిని బట్టే ప్రజలలో గుర్తింపు ఉంటుందని అన్నారు. త్వరలోనే చిల్పూర్ మండల కేంద్రంలో మండల కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తానని తెలిపారు. వాటి నిర్మాణం ఏడాదిలో పూర్తి చేసి మండల ప్రజలకు బహుమానంగా అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్పూరు గుట్ట ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, తహసీల్దార్, ఎంపిడివో, ఫతేపూర్ సర్పంచ్ గుగులోతు లక్ష్మి ఉమ్లా నాయక్, నాయ కులు సురేష్, బాలరాజు, రంజిత్ రెడ్డి, మల్లారెడ్డి సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకు లు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ రాష్ట్ర టీడీపీ నేత సాంబశివరావును పరామర్శించిన డాక్టర్ వాసిరెడ్డి రామనాథం



**ఖమ్మం బ్యూరో/జనవరి 9(జర్నలిస్ట్ వార్త):**పెనుబల్లి మండలం గంగదేవిపాడు గ్రామంలో ఇటీవల గుండె శస్త్రచికిత్స చేసుకొని విశ్రాంతి తీసుకుంటున్న కనగాల సాంబశివరావును పరామర్శించిన టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, జీవిత బీమా సంస్థ బ్రాంచ్ మేనేజర్ బానోతు హాథీ పరామర్శించారు.

# బాధిత కుటుంబానికి పరుపాటి ఆర్థిక సహాయం



**రాయపర్తి/జనవరి 9(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గాడిపెల్లి పెంటయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా శుక్రవారం బాధిత కుటుంబాన్ని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో లేతాకుల మధుకర్ రెడ్డి,పరుపాటి రవీందర్ రెడ్డి,సంధి దేవేందర్,గాడిపెల్లి రాములు,గబ్బేట కొమురయ్య,సంకినేని ఎల్లస్వామి,సునీల్,రాజు,లింగాల శ్రీను,కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆట్టహాసంగా ప్రారంభమైన కరాటే పోటీలు

## -ప్రారంభించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**వర్ధన్నపేట జనవరి9(జర్నలిస్ట్ వార్త):**





ఇల్లంద గ్రామం లోని కాకతీయ పాఠశాల లో ఇంటర్ లెవల్ 3 వ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను చాలా అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ను ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమాన్ని ప్రారంభించే ముందు శ్రీ గుడిశాల రామ్ సాయి జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని రెండు నిమిషాలు మౌనం పాటించి అనంతరం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లు ఉప సర్పంచ్ లు వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే చదువుతోపాటు క్రీడలను కూడా ప్రోత్సహించే విధంగా తల్లిదండ్రులు సహకరించాలని అప్పుడే విద్యార్థులు మానసిక, శారీరకద్రఢత్వాన్ని పెంచుతుందని విద్యార్థులు అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు, ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.

# రైతు సంక్షమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం వారి జీవితాల్లో వెలుగులు నింపుతుంది

### రైతు మేళసదస్సులో ఎమ్మెల్యే జారె.

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

### మంత్రి నలమాడ ఉత్తమ్ కుమార్ రెడ్డి





**అశ్వారావుపేట/జనవరి9(జర్నలిస్ట్ వార్త);**

ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధ్యక్షతన అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో రైతులకు ఉపయోగపడే అనేక కీలక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు

ఈ కార్యక్రమంలో వ్యవసాయ చేనేత మార్కెటింగ్ టెక్స్టైల్స్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. రాష్ట్ర నీటిపారుదల సిఏడి ఆహార పౌర సంబంధాల శాఖల మంత్రి నలమాడ ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో సిసి రోడ్ల నిర్మాణానికి బాలికల కోసం హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. అలాగే వ్యవసాయ యాంత్రీకరణ పథకం జాతీయ సహజ వ్యవసాయ మిషన్‌ను అధికారికంగా ప్రారంభించారు భూసార పరీక్షలు మొక్కల విశ్లేషణకు ఉపయోగపడే ఆధునిక ప్రయోగశాలను ప్రారంభించి సహజ వ్యవసాయంపై ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు వివరించారు వ్యవసాయ ఉత్పాదకత పెంపుదల ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచుకునే విధానాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు అనంతరం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు వారి సూచనలను నేరుగా విని రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై స్పష్టత కల్పిస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధిపై ప్రత్యేక సమావేశం (రైతు మేళ) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ , ఐటిడిఏ పిఓ బి రాహుల్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు జిల్లా స్థాయి ఉన్నత అధికారులు, ఆయా శాఖల అధికార యంత్రాంగం, వ్యవసాయ కళాశాల విద్యార్థులు,అధ్యాపకులు,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతులు



పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రైతుసంక్షమమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం రైతుల జీవితాల్లో మార్పు తీసుకురావాలన్నదే తమ ధ్యేయమని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. అదేవిధంగా రైతు మేళ సదస్సు లో వ్యవసాయ సంబంధించి, డ్రిప్ ఇరిగేషన్ సంబంధించి వివిధ రకాల యంత్రాల , విత్తనాల సంబంధించిన స్టాల్స్ రైతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

# మడికొండ టెక్స్టైల్ పార్క్ అభివృద్ధికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శంకుస్థాపన

## స్థానిక పరిశ్రమల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల పెంపుకు ప్రభుత్వం ముందడుగు







**వర్ధన్నపేట/జనవరి 9(జర్నలిస్ట్ వార్త):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 46వ డివిజన్ పరిధిలోని మడికొండ కాకతీయ టెక్స్టైల్ పార్క్‌లో శుక్రవారం సుమారు రూ.11 కోట్ల నిధులతో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని టిజిఐఐసి కార్పొరేషన్ నిర్వహించింది.

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, మడికొండ కాకతీయ టెక్స్టైల్ పార్క్ ప్రాంతం రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి కీలక కేంద్రంగా మారుతుందని చెప్పారు. అందులో మౌలిక సదుపాయాల ఏర్పాటు ప్రభుత్వ ప్రాధాన్యతలో ఉందని, రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం వలన పరిశ్రమదారులకు మెరుగైన వాణిజ్య వాతావరణం ఏర్పడుతుందని, వర్షాకాలంలో నీటి సమస్యలు పూర్తిగా పరిష్కరించబడతాయని తెలిపారు.

టెక్స్టైల్ పరిశ్రమ అభివృద్ధి చెందితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, వర్ధన్నపేట నియోజకవర్గాన్ని పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ఎక్కడా రాజీ పడవద్దని, నిర్ణీత కాలంలో పనులు పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చారని చెప్పారు.టెక్స్టైల్ పార్క్‌లో దశలవారీగా అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పార్క్‌లోని కార్మికుల కోసం ఫౌండేషన్ అక్షయపాత్ర ద్వారా భోజన సదుపాయం ఏర్పాటు చేస్తామని, తదుపరి మంత్రి పొంగులేటి తో సమావేశం నిర్వహించి పూర్తి స్థాయిలో అన్ని వసతులు కల్పిస్తామని చెప్పారు.క్రమంగా పార్క్‌లో పరిశ్రమల వృద్ధి సాధ్యమయ్యేలా అన్ని చర్యలు తీసుకుంటామని, పరిశ్రమలు సక్రమంగా నడిచేలా ప్రభుత్వం సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూరుగోండ శ్రీనివాస్, జోనల్ మేనేజర్ స్వామి, ఎమ్మార్వో బావ్ సింగ్, కాకతీయ టెక్స్టైల్ ఉ వీవర్స్ వెల్ఫేర్ పొదుపు సంఘం సభ్యులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ అభివృద్ధి–స్థానిక ఉపాధి అవకాశాల పెంపు: అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల ఏర్పాటు పరిశ్రమదారులకు సౌకర్యాలను పెంచి, వర్షాకాలంలో కూడా నిరంతర ఉత్పత్తిని సాధించగలుగుతుంది. పరిధిలోని యువతకు నేరుగా ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక–ఆర్థిక పరిస్థితులు మెరుగవుతాయని విశ్లేషకులు పేర్కొన్నారు.



# ప్రాజెక్టుల్లో మునిగిపోతున్న నిర్వాసిత జీవితాలు


పోలవరం


మల్లన్న సాగర్

**జనవరి 9 (జర్నలిస్ట్ వార్త):** పోలవరం కావచ్చు...మల్లన్న సాగర్ కావచ్చు లేదా కొండపోచమ్మ సాగర్ కావచ్చు లేదా..గతంలో గంగవరం పోర్టు కావచ్చు..ప్రాజెక్టులు ఏవైనా త్యాగం ప్రజలది, భోగం కార్పొరేట్లది అవుతోంది. వేలకోట్లు పెట్టి ప్రభుత్వాలు కట్టించే ప్రాజెక్టులు సైతం కార్పొరేట్లకు ధారదత్తం చేస్తున్నారు. భూముల సేరణ, ఇళ్లను సేకరించడం తరవాత వారికి కబుర్లు చెప్పడం ఆ తరవాత వారి త్యాగాలను మరచిపోతున్నారు. గంగవరం పోర్టు కోసం త్యాగం చేసిన మత్స్యకారులు రోడ్డున పడ్డారు. పోర్టును పొందిన ఆదానీ ఒడ్డున పడ్డారు. ఇలా ఏ ప్రాజెక్టు తీసుకున్నా ఇదే చరిత్ర కనిపిస్తుంది. ఘనత వహించిన తెలంగాణ వల్లభుడు కెసిఆర్ హయాంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లకు భూములు ఇచ్చి, ఊర్లను త్యాగం చేసిన వారు ఆగమయ్యారు. కెసిఆర్, ఆయన అనుయాయులు పొలాలు మాత్రం పచ్చగా తడుస్తున్నాయి. తాజాగా అమరావతి రాజధాని కోసం లక్ష ఎకరాలు సేకరిస్తున్నారు. అయినా పాలకలు భూదాహం తీరడం లేదు. అమరావతిలో భూమి తీసుకున్న రైతులకు అరకొరగానే పరిహారం అందించారు. ప్లాట్లను సక్రమంగా అందించలేదు. బహిరంగంగా వారిపై ప్రశంసలు కురిపించడం తప్పవారికి లబ్ది చేకూర్చడం లేదు. ఇంకా ప్లాట్ల కోసం అక్కడి రైతులు పాట్లు పడుతూనే ఉన్నారు. తాజాగా రెండోదఫా భూసేకరణ మొదలయ్యింది. ఈ అభివృద్ధి ఏ ప్రజల కోసమన్నది పాలకులు ఆలోచన చేయాలి. ప్రజలను ముంచి చేసే పనులు మంచి ఎలా అవుతాయి. పోలవరం సంగతి చూస్తే అక్కడి నిర్వాసితులు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఇలా దేశవ్యాప్తంగానే కాదు... తెలుగు రాష్ట్రాల్లో ఘనత వహించిన పాలకులు రైతులను నట్టేట ముంచుతున్నారు. పోలవరంలో సర్వస్వం కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయమైన పరిహారం, పునరావాసం లభించని దుస్థితి ఇప్పటికీ కొనసాగడం అత్యంత విచారకరం.ప్రాజెక్టు పూర్తయి అన్ని ప్రాంతాలకు నీరు అందించడం మునక ప్రాంతంలో 1.20 లక్షల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమైతేనే సాధ్యమవుతుంది. నిర్వాసితులకు భూమికి భూమిగానీ, ఇల్లు కట్టించడంగానీ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలుగానీ జరగలేదు. కట్టించిన కాలనీల్లో వర్షం వస్తే ఇళ్లు కారుతున్నాయి. శ్మశానాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రార్ధనా స్థలాల వంటివేవీ లేవు. 1986లో ఒకసారి, 2022లో మరోసారి వచ్చిన వరద ప్రభావ ప్రాంతాలను పరిశీలిస్తే మునక ప్రాంతంలో జరిగిన కాంటూరు సర్వే, తరువాత చేపట్టిన లైడార్ సర్వే ఏదీ వాస్తవాలను వెల్లడించడం లేదని రుజువైంది. తాజాగా నిర్వాసితుల బ్యాంకు ఎకౌంట్లలో జమచేస్తున్న పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ 2017కు ముందు అంచనాల ప్రకారం నిర్ణయించినవి కావడం గమనార్హం. 2017 తర్వాత డ్యామ్ అంచనాలు రెండుసార్లు సవరించారు కానీ నిర్వాసితులకు మాత్రం పాత ప్యాకేజిలే! పెళ్లయిన యువతులకు పునరావాస ప్యాకేజీ ఇవ్వడం లేదు. పురుషులతో సమానంగా స్త్రీలకు కూడా ప్యాకేజీ అమలు చేయాలి కదా! నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించినా అది అమలుకు నోచుకోలేదు. ఈ ప్రభుత్వం అయినా ప్యాకేజీ తాజా ధరలకు అనుగుణంగా సవరించి పెంచి ఇస్తుందేమోనని నిర్వాసితులు ఆశిస్తున్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు వాటి ఊసే ఎత్తుకోలేదు. పర్యటనలో డ్యామ్ నిర్మాణ పనులను ఆమూలాగ్రం పరిశీలించిన ఆయన ముంపు ప్రాంతాలను, పునరావాస కాలనీలను కూడా సందర్శిస్తే బాగుండేది. అక్కడి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటే వాటిని సత్వరం పరిష్కరించడానికి, అనేక అవకతవకలను, సర్వేలో జరిగిన పొరపాట్లను సరిదిద్దడానికి అవకాశం వుండేదని ప్రాజెక్టు బాధితుల భావన. వచ్చే సంవత్సరం జరిగే గోదావరి పుష్కరాల్లోగా అంటే మార్చి

నెలకల్లా పోలవరం ప్రాజెక్టు జాతికి అంకితం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వాసితులకు న్యాయం చేయడానికి కృషి చేయడం లేదు. తీయని మాటలు తప్ప చిత్తశుద్ధ ఇకానరావడం లేదు. జలయజ్ఞంలో పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదించినపుడు ఒకటే దశ. కానీ రాష్ట్ర విభజన చట్టం దాన్ని జాతీయ ప్రాజెక్టుగా పేర్కొనడంతో నిర్మాణ బాధ్యత కేంద్రానిదయ్యింది. నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మొదటంతా కేవలం ఇరిగేషన్ కాంపొనెంట్ మాత్రమే బాధ్యతని, అంటే డ్యాం, ప్రధాన కాలువల నిర్మాణమేనని బుకాయించి, పునరావాస పునర్నిర్మాణ విషయాన్ని దాటవేస్తూ వచ్చింది. ఆ తరువాత ప్రాజెక్టును రెండు దశలుగా మార్పించింది. డ్యాం 41.15 మీటర్ల ఎత్తు వరకు మొదటి దశగానూ, పూర్తి రిజర్వాయర్ మట్టం 45.72 మీటర్లు రెండోదశ అన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీలు మారినా అప్పుడు, ఇప్పుడూ కేంద్రం కనుసన్నల్లో నడుచుకుంటున్నవే కనుక తలాడించాయి. అయితే, డ్యాం నిర్మాణం విషయంలో మాత్రం ఇది వర్తించదనీ, నిర్మాణం మొత్తం ఒకటిగానే పూర్తవుతుందని అప్పటి, ఇప్పటి ముఖ్యమంత్రులు చెబుతున్నారు. కాబట్టి నిర్వాసితులను పొమ్మనకుండా పొగబెట్టిన చందంగా రిజర్వాయర్‌లో నీరు నింపి వెళ్లగొట్టడానికే ఈ కుట్ర. అందుకనే దశలవారీ కాకుండా పూర్తి ఎత్తు వరకూ ఆర్ ఆండ్ ఆర్ మొదట పూర్తి చేశాకనే ప్రాజెక్టు నిర్మాణం అని నిర్వాసితులు ఘోష పెడుతున్నారు. మొదటి దశకు సంబంధించిన 41.15 మీటర్ల పరిధిలోని నిర్వాసితులకు 2027 జనవరికల్లా పునరావాసం పూర్తి చేయనున్నట్లు బుధవారంనాడు ముఖ్యమంత్రి చెప్పారు. ఆ లెక్కలు చూసినా మొదటి దశకు సంబంధించిన ఆర్‌అండ్‌ఆర్ అమలు సైతం ఇంకా ఆమడదూరంలో వుందని తేటతెల్లమవుతోంది.డయాఫ్రం వాల్‌ను నాణ్యంగా నిర్మించనందున వరదలకు దెబ్బతిన్నది. విదేశీ నిపుణులు సైతం దీన్ని నిర్ధారించారు కానీ వారిచ్చిన నివేదికను బహిరంగపర్చలేదు. మరమ్మతులకు అదనంగా రూ.900 కోట్లు ఇచ్చారేతప్ప డయాఫ్రం వాల్ దెబ్బతినడానికి కారణమైన కాంట్రాక్టర్లపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. నిర్మాణంలో అవకతవకలను సరిచేయడానికి భవిష్యత్‌లో డ్యాం భద్రతకు అవసరమైన చర్యలను పారదర్శకంగా తీసుకోవాలి. కానీ డయాఫ్రం వాల్ దెబ్బతిన్నా కనిపెట్టలేక పోయారని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఆరేడు సంవత్సరాలు ఆలస్యం అవుతోందని సిఎం చంద్రబాబు చెప్పారే తప్ప అందుకు కారణమైన కాంట్రాక్టర్, ఆనాటి పనులు సర్టిఫైచేసిన ఉన్నతాధి కారులు, గత ప్రభుత్వంలో ఈ అంశాల్లో నిర్ణయాలు చేసినవారిపై ఎలాంటి చర్యలనూ వెల్లడించలేదు. ఇప్పటికైనా ముందు నిర్వాసితులను ఆదుకోవాలి. దుబారా హెలికప్టర్ ఖర్చులు తగ్గించుకుని వారికి న్యాయం చేయాలి.

# మొదలైన సంక్రాంతి ప్రయాణాలు

### ఊరిబాట పట్టిన పట్టణ ప్రజలు -బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద రద్దీ విజయవాడ రహదారిలో బారులు తీరిన వాహనాలు

**హైదరాబాద్,జనవరి 9 (జర్నలిస్ట్ వార్త):** విద్యా సంస్థలకు శనివారం నుంచి సంక్రాంతి సెలవులు రావడంతో శుక్రవారం సాయంత్రం నుంచే హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ మొదలైంది. సంక్రాంతి పండగకు 3 రోజుల ముందే పయనమవుతుండటంతో జాతీయ రహదారిపై వాహనాల సందడి నెలకొంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా జాతీయ రహదారిపై పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. హైవేపై వెళ్లే వాహనాలకు అంతరాయం కలగకుండా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో నారాయణపురం రోడ్డును పోలీసులు మూసివేశారు. పంతంగి టోల్‌ప్లాజా వద్ద మొత్తం 16 టోల్ బూత్‌లు ఉండగా వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని పదింటిని విజయవాడ మార్గంలోనే తెరిచారు. ఫాస్టాగ్ విధానం అమలులో ఉండటంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. అదనపు టోల్ సిబ్బందిని నియమించారు. శని, ఆదివారాల్లో రద్దీ అధికంగా ఉండనుంది. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిక్కిరిపోతున్నాయి. శనివారం నుంచి విద్యాసంస్థలకు సెలవులు, ఆఫీసులకు వీకెండ్ కావడంతో స్వగ్రామాలకు వెళ్లేందుకు హైదరాబాద్ నగర వాసులు పోటెత్తారు. పట్టణాల నుంచి సొంతూళ్లకు బయలుదేరిన ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్లు కళకళలాడుతున్నాయి. మరోవైపు సొంత వాహనాల్లోనూ ప్రజలు స్వగ్రామాలకు బయలుదేరుతున్నారు. దీంతో ప్రధాన రహదారులన్నీ వాహనాలమయంగా మారిపోయాయి. ÷ఎఖ్యంగా హైదరాబాద్ నుంచి తెలంగాణలోని వివిధ ప్లలెలు, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు వెళ్లే వారితో రోడ్లన్నీ నిండిపోయాయి. హైదరాబాద్– విజయవాడ 65వ జాతీయ రహదారి అయితే మరింత రద్దీగా మారింది. పంతంగి టోల్ గేట్ వద్ద వాహనాల బారులు తీరాయి. దీంతో స్వగ్రామాలకు వెళ్లే వారికి ట్రాఫిక్ సమస్యగా మారిపోయింది. రద్దీ సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రయాణాలు చేయాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.



# ఘనంగా పర్వతగిరి గురుకుల పాఠశాల అన్యువల్ డే



## గురుకులాల్లో నాణ్యమైన విద్య - ప్రిన్సిపాల్ పాల్ అపర్ణ

## - చదువుతోనే పేదరిక రేఖను దాటాలి -పర్వతగిరి ఎస్సై భోగం ప్రవీణ్ పిలుపు





















**పర్వతగిరి/జనవరి9(జర్నలిస్ట్ వార్త):**
గురుకులాల్లో నాణ్యమైన విద్య అందుతుందని పీఎం శ్రీ పర్వతగిరి గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ పాల్ అపర్ణ అన్నారు. శుక్రవారం పి.ఎం.శ్రీ పర్వతగిరి గురుకుల పాఠశాలలో అన్యువల్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పర్వతగిరి ఎస్సై ప్రవీణ్, సర్పంచ్ శంకర్, ఎంఈఓ బిక్షపతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గోగుల లావణ్య, వైస్ చైర్మన్ ఐలపాక స్వప్న, లను సాధనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి, జ్యోతి ప్రజ్జలన చేశారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అపర్ణ మాట్లాడుతూ మనిషి జీవితంలో విద్యార్థి దశ కీలకమని గుర్తు చేశారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్యార్థి స్థాయిలో తమ ప్రవర్తన, ఇష్టపడి చదివిన చదువు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిస్తాయన్నారు. నాయకత్వ లక్షణాలు, ఉద్యోగం చేయాలని పట్టుదల, భవిష్యత్తులో తాను ఏ స్థాయిలో చేరుకోవాలనేది.

విద్యార్థి దశలోనే ఉంటుందన్నారు. చదువుకోవడానికి పేదరికం ఆటంకం కావద్దని ప్రభుత్వాలు గురుకుల విద్యాలయాలను ప్రారంభించారని తెలిపారు. ప్రతి విద్యార్థి డాక్టర్ బాబాసాహెబ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గురుకులంలో చదువుకునే ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు సక్రమంగా అందిస్తున్నామని చెప్పారు. కలెక్టర్ సత్య శారద దేవి చలికాలంలో ప్రత్యేక శ్రద్ధతో పర్వతగిరి గురుకులంకు బ్రిజర్ ద్వారా విద్యాధులకు వేడి వాటర్ అందించడం జరిగిందన్నారు. తల్లి తండ్రు లకు మాట్లాడుకోవడం కోసం ఫోన్ మిత్ర అందుబాటులో ఉంటుందని గుర్తు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలలో లోపాలను గుర్తించడం కోసం క్లయింట్ బక్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. భవిషత్ లో మారిన్ని సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. పి ఎం శ్రీ గురుకుల పాఠశాల గా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావడానికి తమ తోటి ఉపాధ్యులు, స్టాప్, విద్య కమిటీ, విద్యార్థులు సహకారం ఎంతగానో ఉందన్నారు.

గురుకులాల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, ప్రోటీన్ విలువలపై ప్రతి నాలుగు నెలలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ పాల్ అపర్ణ తెలిపారు. వార్షికోత్సవ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాటలు, నృత్యాలు, దేశభక్తి గీతాలు ప్రేక్షకులను అలరించాయి. వ్యవసాయ రైతుల జీవితాన్ని ప్రతిబింబించే నాటకాలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి. సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించారని చెప్పారు. 'జై జవాన్ -- జై కిసాన్' నినాదంతో నాటకాన్ని ముగించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

విద్యార్థులకు యోగా శిక్షణ అందిస్తున్నామని, యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. బాలికలకు ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. క్లాస్ ఫస్ట్, సెకండ్ వచ్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ఎస్సై ప్రవీణ్‌తో పాటు పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అందజేశారు.

### గురుకులంలో చదువుతున్న విద్యార్థులే ఉన్నత స్థాయికి ఎదిగారు -వైస్ ప్రిన్సిపల్స్ స్వాతి

వైస్ ప్రిన్సిపల్స్ స్వాతి మాట్లాడుతూ గురుకులంలో చదువుతున్న విద్యార్థుల జీవితాలే ఉన్నత స్థాయికి ఎదిగిన విషయాలను గుర్తు చేశారు. సమాజంలో చాలామంది ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేసేవారు. రాజకీయ రంగంలో అతిపెద్ద స్థాయిలో ఉన్నవారు గురుకులంలో చదివిన విద్యార్థులేనని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పర్వతగిరి గురుకులం అన్ని రంగాల్లో ముందు ఉండటంతో పీఎం శ్రీ గురుకుల విద్యాలయంగా గుర్తించడం జరిగిందని అన్నారు.

ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థుల తల్లి తండ్రు లకు ముఖ్య అతిథులు కృతజ్ఞతలు తెలిపారు.

### విద్యార్థి పట్టుదలతో చదవాలి.. -వైస్ ప్రిన్సిపాల్ జోస్నా...

వైస్ ప్రిన్సిపాల్‌జోస్నా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివితే ఉన్నత లక్ష్యనికి చేరుకుంటామని విద్యార్థుల కు సూచించారు. చదువును కష్టపడి కాకుండా ఇస్తా పడి చదవాలని ప్రేమ పూర్వక సందేశాన్ని అందించారు. హాస్టల్ లో నేర్చుకొన్న ప్రవర్తన చదువు జీవిత కాలం గుర్తుందని. లక్ష్యన్ని మర్చిపోకుండా చదువుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

### చదువుతోనే పేదరిక రేఖను దాటాలి పర్వతగిరి ఎస్సై భోగం ప్రవీణ్ పిలుపు

చదువే ఆయుధంగా పేదరిక రేఖను దాటాలని పర్వతగిరి ఎస్సై భోగం ప్రవీణ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పర్వతగిరి మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల హాస్టల్స్ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, హాస్టల్లో చదువుతున్న విద్యార్థులంతా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చినవారేనని, అయితే చదువు ద్వారా తమ భవిష్యత్తును పూర్తిగా మార్చుకునే అవకాశం ఉందని అన్నారు.

నేటి సమాజం ఏఐ యుగంలోకి అడుగుపెట్టిందని, ఈ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు విజ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. మంచి చెడులను గుర్తించే సామర్థ్యం పెంపొందించుకుంటేనే సమాజంలో నిలదొక్కుకోవచ్చని తెలిపారు. కుటుంబ పరిస్థితులను గుర్తుంచుకుని తల్లిదండ్రుల కలలను నెరవేర్చే దిశగా కష్టపడి చదవాలని, లక్ష్యన్ని ఎప్పుడూ మరిచిపోవద్దని హితవు పలికారు.

గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు పూర్తి భద్రత, వసతి, భోజనం, విద్యా సదుపాయాలు ప్రభుత్వం అందిస్తోందని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సమయాన్ని వృథ చేయకుండా ప్రతి క్షణాన్ని చదువుకు, వ్యక్తిత్వ వికాసానికి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

### విద్యార్థులకు క్రమశిక్షణ తప్పనిసరి -సర్పంచ్ చిదురి శంకర్

ఈ సందర్భంగా పర్వతగిరి సర్పంచ్ చిదురి శంకర్ మాట్లాడుతూ, నేటి విద్యార్థులే రేపటి పౌరులని, ప్రతి విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ అత్యంత అవసరమని అన్నారు. చదువు సమయంలో అలవర్చుకున్న క్రమశిక్షణే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు తీసుకెళు ుందని తెలిపారు.

పర్వతగిరి మండలంలోని ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాల విద్యా, క్రీడా రంగాల్లో ముందుండి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ, ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

### సెలవుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని పేరెన్స్ కమిటీ

**-చైర్మన్ గోగుల లావణ్య**

చైర్మన్ గోగుల లావణ్య మాట్లాడుతూ, సెలవుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై దృష్టి పెట్టితే చదువుపై మరింత పట్టుదల పెరుగుతుందని అన్నారు.

### విద్యార్థి చదువు తమకుటుంబ రూపు రేఖలు మారుస్తుంది

**-వైస్ చైర్మన్ ఐపాలక స్వప్న**

వైస్ చైర్మన్ ఐపాలక స్వప్న మాట్లాడుతూ తాను కూడా నర్సంపేట రెసిడెన్సీ గురుకులంలో నే చదువుకునాన్నని ఇప్పుడు పర్వతగిరి గురుకుల పాఠశాలలో విద్య కమిటీ వైస్ చైర్మన్ గా ఉన్నానని గుర్తు చేశారు. విద్యార్థి చదువు తమకుటుంబ రూపు రేఖలు మారుస్తుందన్నారు. విద్యార్థుల కు గుర్తు చేశారు.

### సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

మాజీ వైస్ చైర్మన్ కుమారస్వామి మాట్లాడుతూ, విద్యార్థులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ లక్ష్య సాధన దిశగా ముందుకెళ్లాలని సూచించారు.

### అధితులకు ఘన సన్మానం... గురుకుల పాఠశాల









అనివ్ డే సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై ప్రవీణ్, నూతన సర్పచ్ శంకర్, ఉప సర్పంచ్ అనిత, పేరెన్స్ కమిటీ చైర్మన్ గోగుల లావణ్య, వైస్ చైర్మన్ ఐలపాక స్వప్న, మాజీ వైస్ చైర్మన్ వేల్పుల కుమారస్వామి లను ప్రిన్సిపాల్ అపర్ణ ఉపాధ్యులు బొకే ఆన్ అందించింది, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి హాజరు కావడం చాలా సంతోషంగా ఉంటుందన్నారు. ఈ గురుకుల పాఠశాల కోసం తమ వంతు సహాయ సహకారాలు అందింస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బిక్షపతి, ఉపసర్పంచ్ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.






